JAYABHERIDAILY.COM

జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రభాత జయభేరి

ప్రజల పక్షాన అక్షర యజ్ఞం

ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి

మేడ్చల్ - మల్కాజిగిరి । సోమవారం 02-02-2026

Medchal - Malkajgiri । Monday 02-02-2026

Follow: jayabherinews

సంపుటి : 02 । సంచిక : 247

పేజీలు : 8 । వెల : 5

Vol. 02 । Issue 247 । Pages : 8 । ₹: 5

విలేకర్లు కావలెను

మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?

సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?

మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!

ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..

డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...

"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...

9391 544 889 call me

jayabheripaper@gmail.com



## వరుసగా తొమ్మిదోసారి

# కేంద్ర బడ్జెట్

- ఎస్‌టీటీలపై సీతారామన్ ఏం ప్రకటించారు
- స్టాక్‌మార్కెట్ ఎందుకు పతనమైంది?
- ఏప్రిల్ 1 నుంచి కొత్త ఆదాయపు పన్ను చట్టం
- రేర్ ఎర్త్ మినరల్స్ కోసం ప్రత్యేక కారిడార్

**జయభేరి, న్యూఢిల్లీ:**

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆదివారం పార్లమెంటులో బడ్జెట్ సమర్పణ సందర్భంగా చేసిన ప్రసంగానికి స్టాక్ మార్కెట్ ప్రతికూలంగా స్పందించింది. ఆర్థిక మంత్రి ప్రసంగం ముగిసే సమయానికి స్టాక్ మార్కెట్ గణనీయమైన క్షీణతను నమోదు చేసింది. సెన్సెక్స్ ఒక దశలో 2300 పాయింట్లు పడిపోయింది. మల్టీ కమోడిటీ ఎక్స్చేంజ్ మార్కెట్‌లో షేర్లు ఒక రోజులో 19.18 శాతం నష్టపోయాయి. కోవిడ్ తర్వాత ఎంసీఎక్స్ మార్కెట్‌లో ఈ స్థాయి పతనం నమోదు కావడం ఇదే మొదటిసారి. స్టాక్ మార్కెట్లో ఫ్యూచర్స్ ట్రేడింగ్‌పై సెక్యూరిటీ ట్రాన్సాక్షన్ టాక్స్ (STT) పెంచుతున్నట్లు ప్రకటించడం వల్లే మార్కెట్లు ప్రతికూలంగా స్పందించాయని నిపుణులు భావిస్తున్నారు. ఆదివారం స్టాక్ మార్కెట్ తెరిచి ఉంచటం చాలా అరుదు. అయితే బడ్జెట్ ప్రవేశ పెడుతూ ఉండటంతో మార్కెట్‌లో ట్రేడింగ్ జరిగింది. ఫ్యూచర్స్ ట్రేడింగ్‌పై సెక్యూరిటీ ట్రాన్సాక్షన్ టాక్స్‌ను 0.02 శాతం నుండి 0.05 శాతానికి పెంచాలని ప్రతిపాదిస్తున్నట్లు ఆర్థిక మంత్రి తెలిపారు. దీంతో స్టాక్ మార్కెట్లలో భారీ అమ్మకాలు కనిపించాయి. "సెక్యూరిటీస్ లావాదేవీల పన్ను"

...మిగతాది 2 లో

## ఏయే వస్తువుల ధరలు తగ్గుతాయి ఏవి పెరుగుతాయి?

- కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆదివారం పార్లమెంటులో 2026-, 27 కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశ పెట్టారు.

**జయభేరి, న్యూఢిల్లీ:**

కేంద్ర బడ్జెట్ అనగానే ఉద్యోగులు, ఆదాయ పన్ను మినహాయింపుల కోసం చూస్తే, సామాన్య ప్రజలు, గృహిణులు బడ్జెట్‌లో ఏ వస్తువుల ధరలు పెరుగుతాయి, ఏ వస్తువుల ధరలు తగ్గుతాయి అని చూస్తారు. కేంద్ర ఆర్థిక బడ్జెట్‌లో తయారీ, ఎగుమతి, గ్రీన్ ఎనర్జీకి ఉపశమనం లభించింది. మరోవైపు స్టాక్ మార్కెట్‌కు సంబంధించిన పెట్టుబడులు, లావాదేవీలపై పన్ను విధించారు. క్యాన్సర్ చికిత్సలో ఉపయోగించే 17 ఔషధాలపై ప్రభుత్వం ప్రాథమిక కస్టమ్స్ సుంకాన్ని తొలగించింది. దీని వల్ల భారత మార్కెట్‌లో ఈ మందులు చౌకగా లభిస్తాయి. 7 అరుదైన వ్యాధుల చికిత్స కోసం విదేశాల నుండి దిగుమతి చేసుకునే మందులపై సుంకాన్ని కూడా ప్రభుత్వం తొలగించింది. ఎలక్ట్రిక్ వాహనాలు, సోలార్ ప్యానెళ్లు, గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తికి సంబంధించిన కొన్ని పరికరాలపై సుంకాన్ని తగ్గించారు. ఇది సాధారణ వినియోగదారులు, రోగులు, పెట్టుబడిదారులు, పరిశ్రమలపై ప్రత్యక్ష ప్రభావాన్ని చూపుతుంది. అయితే బడ్జెట్‌లో పన్నులకు సంబంధించి ఎలాంటి రాయితీలు ఇవ్వలేదు.

...మిగతాది 2 లో

## ఉద్యమ గదిలో విచారణ..

# కేసీఆర్ భావోద్వేగం

- ఫోన్ ట్యాపింగ్ సెగ.. 5 గంటల పాటు కేసీఆర్‌పై ప్రశ్నల వర్షం.. ఏం తేల్చారు?
- కేసీఆర్ కు సిట్ సంధించిన అస్త్రాలు : ఆ ప్రశ్నల వెనుక అంతర్యం ఇదే
- రాష్ట్రవ్యాప్తంగా నిరసన జ్వాలలతో దద్దరిల్లిన తెలంగాణ
- కేసీఆర్ అరెస్టు తప్పదా? రాజకీయాల్లో హాట్ టాపిక్



**జయభేరి, హైదరాబాద్ :**

తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు నివాసం నందినగర్ ఆదివారం రాజకీయ రణరంగంగా మారింది. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న కేసీఆర్‌ను విచారించేందుకు సిట్ అధికారులు మధ్యాహ్నం 3 గంటలకు ఆయన నివాసానికి చేరుకున్నారు. మాధాపూర్ డీసీపీ రీతిరాజ్ నేతృత్వంలోని ఆరుగురు సభ్యుల బృందం కేసీఆర్‌ను సుమారు 4 గంటల 50 నిమిషాల పాటు ఏకధాటిగా ప్రశ్నించింది. ఈ విచారణ ప్రక్రియ మొత్తాన్ని అధికారులు ఆడియో, వీడియో రికార్డింగ్ చేయడం గమనార్హం.

...మిగతాది 2 లో

## తెలంగాణ దేశంలో అంతర్భాగం కాదా ..?

- 'ఆరెంజ్ ఎకానమీ'ని ముంబైకి తరలించడం వెనుక అంతర్యమేమిటి?



**జయభేరి, హైదరాబాద్ :**

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ తెలంగాణ ప్రజలను తీవ్రంగా నిరాశపరిచింది. రాష్ట్ర అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మా మంత్రివర్గ బృందం స్వయంగా ఢిల్లీకి వెళ్లి ప్రధానమంత్రిని, కేంద్ర ఆర్థిక మంత్రిని కలిసి అనేక విజ్ఞప్తులు చేసినప్పటికీ, ఒక్క విన్నపాన్ని కూడా పరిగణనలోకి తీసుకోకపోవడం దురదృష్టకరం. కోవిడ్ సమయంలో భారత్ బయోటెక్ ద్వారా ప్రపంచానికే ప్రాణవాయువునిచ్చిన హైదరాబాద్ నగరాన్ని ఫార్మా హబ్ కేటాయింపుల్లో విస్మరించడం అన్యాయం. ఆడియోవీడియో, గేమింగ్ రంగాల్లో దేశానికే దిక్సూచిగా ఉన్న హైదరాబాద్‌ను కాదని, 'ఆరెంజ్ ఎకానమీ'ని ముంబైకి తరలించడం వెనుక అంతర్యమేమిటి? రీజినల్ మెడికల్ వ్యాల్యూ హబ్‌ల ఏర్పాటులోనూ తెలంగాణ పేరు లేకపోవడం మా అభివృద్ధిని అడ్డుకోవడమే.

...మిగతాది 2 లో

## ప్రధాని మోదీ పేరు ప్రస్తావనపై విదేశాంగ శాఖ ఏం చెప్పింది

2 లో




## పార్టీ ఇచ్చే బీ ఫారంపై

# సిరాతో సంతకం

- బీ-ఫారం పొందిన వ్యక్తికే ఆ పార్టీ గుర్తును రిటర్నింగ్ అధికారి కేటాయిస్తారు
- బీ-ఫారం చెల్లుబాటు కాకపోతే ఆ అభ్యర్థి 'స్వతంత్ర గుర్తు' దక్కుతుంది

**జయభేరి, హైదరాబాద్ :**

రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల వేడి కొనసాగుతోంది. ప్రధాన పార్టీల ఆశావాహులు నామినేషన్లను దాఖలు చేశారు. ఎన్నికల సంఘం వద్ద గుర్తింపు పొందిన పార్టీకి చెందిన అభ్యర్థులకు కీలకమైన బీఫామ్ ను పార్టీ అందిస్తుంటుంది. బీఫారం అంటే.. గుర్తింపు పొందిన జాతీయ, ప్రాంతీయ పార్టీలు తమ పార్టీ నుంచి ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు వీరేనని గుర్తించేలా ఇచ్చేదే 'బీ' ఫారం. నామినేషన్ వేసే సమయంలో ఎన్నికల అధికారులకు ఈ ఫారాన్ని దాఖలు చేస్తేనే పార్టీకి సంబంధించి ఎన్నికల గుర్తును సదరు అభ్యర్థికి కేటాయిస్తారు. పార్టీ అధ్యక్షుడు, ప్రత్యేకంగా నియమితులైన ప్రతినిధుల ద్వారా బీ ఫారాన్ని అందిస్తారు. ఇప్పటికే మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేస్తున్న తమ పార్టీ అభ్యర్థులకు బీఫామ్ ఇచ్చే ఆథరైజేషన్ ప్రతినిధి పేరిట పార్టీ ఇచ్చే ఏ ఫామ్ గత నెల

...మిగతాది 2 లో

## వికసిత్ భారత్ దిశగా

# బ్యాలెన్స్‌డ్ బడ్జెట్




- వికసిత్ భారత్ దిశగా బ్యాలెన్స్‌డ్ బడ్జెట్
- సీఎం చంద్రబాబు
- యువత సాధికారిత సాధించేలా బడ్జెట్..
- దీర్ఘకాలిక లక్ష్యాలకు అనుగుణంగా బడ్జెట్..
- టెక్స్‌టైల్ సెక్టార్‌కు ఊతం..

**జయభేరి, చిత్తూరు, ఫిబ్రవరి 1 :**

2047 వికసిత్ భారత్ దిశగా కేంద్ర ప్రభుత్వం ఆదివారం బ్యాలెన్స్‌డ్ బడ్జెట్ ప్రవేశ పెట్టిందని ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. కేంద్ర బడ్జెట్‌తో ఏపీకి కొత్త అవకాశాలు వస్తాయని వివరించారు. ఇది ఫార్వర్డ్ లుకింగ్ బడ్జెట్ అని పేర్కొన్నారు. కేంద్ర బడ్జెట్‌ను స్వాగతిస్తున్నానని తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను ప్రత్యేకంగా అభినందిస్తున్నానని చెప్పుకొచ్చారు. ఆదివారం కుప్పంలో సీఎం పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం సీఎం చంద్రబాబు మీడియాతో మాట్లాడారు.

...మిగతాది 2 లో

▶▶ మొదటిపేజీ తరువాయి

## బీ ఫారంపై సిరాతో సంతకం

30వ తేదీన ఎన్నికల అధికారులకు సమర్పించారు. మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసిన చాలామంది ఆశావాహులకు పార్టీలు ఇచ్చే బీఫామ్ పై చర్చ జరుగుతోంది. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు బీఫామ్ ఎంతో కీలకమైనది. బీఫారం పొందిన వ్యక్తికే ఆ పార్టీ గుర్తును రిటర్నింగ్ అధికారి కేటాయిస్తారు. బీఫారం చెల్లుబాటు కాకపోతే ఆ అభ్యర్థి 'స్వతంత్ర గుర్తు' దక్కుతుంది. పార్టీ ఆర్థరైజ్ చేసిన ప్రతినిధి బీఫారంపై తన సంతకం 'సిరా'తో చేస్తేనే చెల్లుబాటు అవుతుంది. సిరాతో మాత్రమే సంతకం చేయాలని ఎన్నికల సంఘం నిబంధన విధించింది. పార్టీ ఆర్థరైజ్ చేసిన వ్యక్తి బి ఫామ్ లపై సాధారణ బాల్ తో సంతకం చేస్తే తిరస్కరణకు గురవుతోంది. పార్టీ ప్రతినిధి బీఫారంపై తన సంతకం ఉన్న రబ్బరు స్టాంపు వేసినా, ఫ్యాక్స్ ద్వారా పంపినా అంగీకరించరు. బి ఫామ్ పై సిరాతో సంతకం చేయకపోతే ఆ అభ్యర్థికి పార్టీ గుర్తు కోల్పోయే అవకాశం ఉంది. అందుకే బీ ఫామ్ జారీల విషయంలో పార్టీలు ఎన్నో జాగ్రత్తలు చర్యలు తీసుకుంటాయి.

## వికసిత్ భారత్ దిశగా.. బడ్జెట్

**యువత సాధికారిత సాధించేలా బడ్జెట్..**

రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించిన అంశాల్లో మరింతగా దూకుడుగా వెళ్లేందుకు ఈ బడ్జెట్ సహకరించేలా ఉందని సీఎం చంద్రబాబు తెలిపారు. రాష్ట్రం అమలు చేస్తున్న ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానానికి ఈ బడ్జెట్ మరింత సహకరించేలా ఉందని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఎంఎస్ఎంఈలపై ఎక్కువగా దృష్టి సారించిందని... వీటిని మరింత బలోపేతం చేసుకునే అవకాశం ఉందని వెల్లడించారు. మహిళలు, రైతులు, యువత సాధికారిత సాధించేలా బడ్జెట్ ఉందని చెప్పుకొచ్చారు. 2047 వికసిత్ భారత్ డెవలప్‌మెంట్ ఎకానమీగా మారేందుకు ఇది ఉపయోగపడుతుందని తెలిపారు. ఆర్థిక మంత్రి బ్యాలెన్స్‌డ్ బడ్జెట్ ప్రవేశపెట్టారని ప్రశంసించారు. ఏఐతో సహా వివిధ టెక్నాలజీలు, నెక్స్ట్ లెవల్ ఆఫ్ రిఫార్మ్స్‌కు వెళ్తుందని పేర్కొన్నారు.

**దీర్ఘకాలిక లక్ష్యాలకు అనుగుణంగా బడ్జెట్..**

రెన్యువబుల్ ఎనర్జీ, వన్ గ్రిడ్ నేషన్ దిశగా బడ్జెట్ ఉందని సీఎం చంద్రబాబు తెలిపారు. 'స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక లక్ష్యాలకు అనుగుణంగా బడ్జెట్ రూపొందించారు. మెరుగైన జీవన ప్రమాణాలు, ఈజ్ ఆఫ్ లివింగ్ కోసం దోహదం చేసేలా బడ్జెట్ ఉంది. హైదరాబాద్‌బెంగుళూరు, హైదరాబాద్ చెన్నై హైస్పీడ్ రైల్ కారిడార్ ద్వారా రాష్ట్రానికి ఉపయోగం ఉంది. తిరుపతి, అమరావతి వంటి ప్రాంతాలు ఈ హైస్పీడ్ కారిడార్లల్లో కవర్ అవుతాయి. బెంగుళూరు చెన్నై హైస్పీడ్ రైల్ కారిడార్ వల్ల పలమనేరు, చిత్తూరు, తదితర ప్రాంతాలు కవర్ అవుతాయి. ఈ మూడు హైస్పీడ్ రైల్ కారిడార్లు ఏపీలోని వివిధ ప్రాంతాలను కవర్ చేస్తాయి. హైదరాబాద్, అమరావతి, బెంగుళూరు, చెన్నై లాంటి నగరాలు అన్ని అనుసంధానం అవుతాయి. డెడికేటెడ్ రేర్ ఎర్త్ కారిడార్లో ఏపీ కూడా ఉంది. అత్యంత విలువైన భార ఖనిజాలు వెలికి తీసి క్రిటికల్ ఎలక్ట్రానిక్స్ తయారీకి ఉపకరించే అవకాశం ఉంది' అని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు.

**టెక్స్‌టైల్ సెక్టార్‌కు ఊతం..**

ఐఎస్ఎం 2.0 ద్వారా సెమీ కండక్టర్‌కు రూ.40 వేల కోట్లు పెట్టారు. టెక్స్‌టైల్ సెక్టార్‌కు కూడా ఊతమిచ్చారని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. 'మన రాష్ట్రానికి ఈ అంశం చాలా ఉపకరిస్తుంది. పర్యాటకానికి, హాస్పిటాలిటీకి కూడా ప్రాధాన్యం ఇచ్చారు. మన రాష్ట్రంలో అరకులో టూరిజం పెరగడానికి దోహదం చేస్తుంది. కోకోనట్, జీడి, కోకో, చందనం లాంటి పంటలకు ఊతమిచ్చేలా చర్యలు ఉన్నాయి. డేటా సెంటర్లకు పన్ను మినహాయింపులు 2047 వరకూ పెట్టారు. భారత్.. డేటా సెంటర్ల హబ్‌గా తయారవుతుంది. విశాఖపట్నానికి గూగుల్‌తో సహా వివిధ డేటా సెంటర్లు వస్తున్నాయి. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌కు ఊతమిచ్చేలా ఈ డేటా సెంటర్లు తయారవుతాయి. పెద్దఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయి. లాజిస్టిక్స్ రంగానికి ఏపీ పూర్తి స్థాయిలో దృష్టి సారించింది. కేంద్ర బడ్జెట్‌లో తొలిసారిగా లాజిస్టిక్స్ రంగం అభివృద్ధి గురించి ప్రస్తావించారు' అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

## కేసీఆర్ భావోద్వేగం

విచారణ ప్రారంభానికి ముందు కేసీఆర్ తీవ్ర భావోద్వేగానికి లోనైనట్లు సమాచారం. ఏ గదిలో కూర్చుని తాను తెలంగాణ రాష్ట్ర సాధన కోసం వ్యూహాలు రచించారో, ఏ ఇంట్లో నుంచి ఉద్యమాన్ని నడిపించారో.. అదే గదిలో నేడు నేరారోపణలపై విచారణ ఎదుర్కోవాల్సి రావడం పట్ల ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. "స్వరాష్ట్రం కోసం నిద్రలేని రాత్రులు గడిపిన చోట ఈ పరిస్థితి వస్తుందని ఊహించలేదు" అని ఆయన తన సన్నిహితుల వద్ద వాపోయినట్లు తెలుస్తోంది. విచారణలో సిట్ అధికారులు కేసీఆర్‌ను ఉక్కిరిబిక్కిరి చేసేలా ప్రశ్నలు సంధించారని రిపోర్టులు పేర్కొంటున్నాయి. ఇంటెలిజెన్స్ అధికారులకు ఫోన్ ట్యాపింగ్ చేయమని మీరు నేరుగా ఆదేశాలు ఇచ్చారా? ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ ప్రభాకర్ రావుకు పదవీ విరమణ తర్వాత కూడా బాధ్యతలు ఎందుకు పొడిగించారు? ఆయన ద్వారానే ట్యాపింగ్ నడిచిందా? మునుగోడు ఉపఎన్నిక సమయంలో ఎమ్మెల్యేల కొనుగోలుకు సంబంధించిన ఆడియో రికార్డింగ్‌లు మీకు ఎలా దొరికాయి? అది ట్యాపింగ్ ఫలితమేనా? ట్యాపింగ్ పరికరాల కొనుగోలు కోసం ప్రభుత్వ నిధులు కాకుండా పార్టీ ఫండ్స్ వాడారా? ఎలక్టోరల్ బాండ్స్ ఇచ్చిన వారి ఫోన్లు ఎందుకు ట్యాప్ అయ్యాయి? ఇలాంటి కొన్ని ప్రశ్నలను వేసినట్టు మీడియా కథనాలు పేర్కొంటున్నాయి.
కేసీఆర్ విచారణకు నిరసనగా బీఆర్ఎస్ శ్రేణులు రాష్ట్రవ్యాప్తంగా రోడ్లపైకి వచ్చారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్ వద్ద ఉద్రిక్తత నెలకొంది. కార్యకర్తలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాసాన్ని ముట్టడించేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. మహబూబ్‌నగర్, నిజామాబాద్, హుజరాబాద్, మంచిర్యాల వంటి ప్రాంతాల్లో భారీ బైక్ ర్యాలీలు, రాస్తారోకోలు నిర్వహించారు. కేసీఆర్ అంటే ఒక వ్యక్తి కాదు.. తెలంగాణ చరిత్ర అంటూ కేటీఆర్ సామాజిక మాధ్యమాల్లో కామెంట్ల వర్షం కురుపిస్తున్నారు. విచారణ ముగిసిన అనంతరం కేసీఆర్ ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌కు బయలుదేరారు. వెళ్లే ముందు పార్టీ ముఖ్య నేతలు కేటీఆర్, హరీష్ రావులతో సమావేశమై భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. సిట్ అధికారులు సేకరించిన సమాచారాన్ని కోర్టుకు సమర్పించనున్నారు. కేసీఆర్ ఇచ్చిన సమాధానాలు తదుపరి చర్యలకు కీలకం కానున్నాయి. ఈ కేసులో మరి కొందరు కీలక నేతలకు నోటీసులు అందే అవకాశం ఉందన్న ప్రచారం రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేపుతోంది.

## తెలంగాణ దేశంలో అంతర్భాగం కాదా?

రామప్ప వంటి యునెస్కో వారసత్వ కట్టడాలు, మేడారం వంటి అంతర్జాతీయ గుర్తింపు పొందిన జాతరలు ఉన్న తెలంగాణను టూరిజం ప్యాకేజీలో చేర్చకపోవడం శోచనీయం. సెమీ కండక్టర్ పరిశ్రమల కోసం మేము చేసిన విన్నపాన్ని తోసిపుచ్చి, ఇతర రాష్ట్రాలకు ప్రాధాన్యతనివ్వడం రాష్ట్ర యువత ఉపాధి అవకాశాలను దెబ్బతీయడమే. సింగరేణి సంస్థ రేర్ ఎర్త్ మినరల్స్ రంగంలో చేస్తున్న కృషిని కేంద్రం గుర్తించకపోవడం సరికాదు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల సంక్షేమాన్ని విస్మరించడమే కాకుండా, గ్రామీణ పేదల జీవనాధారమైన ఉపాధి హామీ పథకానికి తూట్లు పొడిచేలా కేంద్రం వ్యవహరిస్తోంది. కేంద్రం తన ద్రవ్య లోటు (Fiscal Deficit) పరిమితిని 4.3 శాతానికి పెంచుకుని, రాష్ట్రానికి మాత్రం 4 శాతం అనుమతి నిరాకరించడం సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధం. తెలంగాణ దేశంలో అంతర్భాగం కాదా ..? 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా ఎదగాలన్న మా లక్ష్యానికి కేంద్రం తోడ్పాటు అందించాల్సింది పోయి, నిర్లక్ష్యం చేయడం వికసిత్ భారత్ లక్ష్యానికి ఆటంకం. రాజకీయాలకు అతీతంగా తెలంగాణ పార్లమెంట్ సభ్యులందరూ ఈ అన్యాయంపై గళమెత్తాలని, పార్లమెంట్‌లో మన రాష్ట్ర హక్కుల కోసం పోరాడాలని కోరుతున్నాను. కక్షసాధింపులు పక్కన పెట్టి, తెలంగాణ ప్రయోజనాల కోసం కేంద్రం పునరాలోచించాలి.

# ప్రధాని మోదీ పేరు ప్రస్తావనపై విదేశాంగ శాఖ ఏం చెప్పింది




'ఎప్‌స్టీన్ ఫైల్స్' పేరుతో ఉన్న ఈ మెయిల్‌లో భారత ప్రధాని నరేంద్ర మోదీ, జెఫ్రీ ఎప్‌స్టీన్ మధ్య సమావేశం జరిగిందనే ఆరోపణలను భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ తోసిపుచ్చారు.
అమెరికాకు చెందిన లైంగిక నేరస్థుడు, మానవ అక్రమ రవాణాదారు జెఫ్రీ ఎప్‌స్టీన్‌కు సంబంధించిన ఫైళ్లలో ప్రధాని నరేంద్ర మోదీ పేరు ఉందని కాంగ్రెస్ జనవరి 31 ఆరోపించింది.
"ఇది దేశానికి సిగ్గుచేటు. ప్రధాని మోదీ ముందుకు వచ్చి మా మూడు ప్రశ్నలకు సమాధానం చెప్పాలి" అని కాంగ్రెస్ నాయకుడు పవన్ ఖేరా 'ఎక్స్'లో డిమాండ్ చేశారు. అయితే విదేశాంగ మంత్రిత్వ శాఖ ఈ ఆరోపణలను తోసిపుచ్చింది, జూలై 2017లో ప్రధాని మోదీ ఇజ్రాయెల్ అధికారిక పర్యటన తప్ప "ఈమెయిల్‌లోని మిగిలిన విషయాలు దోషిగా తేలిన నేరస్థుడి పనికిమాలిన మాటలు తప్ప మరేమీ కాదు. అవి అసలు పట్టించుకునే విషయాలు కాదు" అని పేర్కొంది. "ఎప్‌స్టీన్ ఫైల్స్ నుంచి ఒక ఈ మెయిల్ నివేదిక అందింది. అందులో మోదీ ఇజ్రాయెల్ పర్యటన గురించి ఉంది'' అని విదేశాంగ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటన విడుదల చేసింది.

**కాంగ్రెస్ ఏమంటోంది?**

"ఎప్‌స్టీన్ ఫైళ్లలో నరేంద్ర మోదీ పేరు కనిపించింది. అమెరికన్ సీరియల్ రేపిస్ట్, పెడోఫైల్ (పిల్లలపై లైంగిక ఆకర్షణ ఉండే వ్యక్తులు), మానవ అక్రమ రవాణాదారు జెఫ్రీ ఎప్‌స్టీన్ జూలై 9, 2017న ఒక ఈ మెయిల్‌లో రాశారు..." అని కాంగ్రెస్ తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' ద్వారా పేర్కొంది.
''అమెరికా అధ్యక్షుడి ప్రయోజనాల కోసం భారత ప్రధాని మోదీ ఇజ్రాయెల్‌లో పాటలు పాడి డాన్స్ చేశారు. వారు కొన్ని వారాల క్రితం కలిశారు. అది పనిచేసింది". "మోదీ నా సలహా తీసుకుని ఇజ్రాయెల్ వెళ్లి అమెరికా అధ్యక్షుడి ప్రయోజనం కోసం డాన్స్ చేసి, పాటలు పాడారని ఎప్‌స్టీన్ స్పష్టంగా చెబుతున్నారు. అది పనిచేసిందని కూడా ఆయన అన్నారు" అని కాంగ్రెస్ పోస్టుచేసింది. "ప్రధాని మోదీ 2017లో జూలై 4 నుంచి 6 మధ్య ఇజ్రాయెల్‌లో పర్యటించారు. ఆ తర్వాత మూడు రోజులకు ఎప్‌స్టీన్ ఈ మెయిల్ రాశారు. ఇజ్రాయెల్ పర్యటనకు ముందు జూన్ 2526న అధ్యక్షుడు ట్రంప్‌ను అమెరికాలో మోదీ కలిశారు. ఎప్‌స్టీన్ ఈ మెయిల్‌లోని లింక్‌లను కలిపి చూస్తే మోదీ జూన్ 2017లో అమెరికా వెళ్లి అక్కడ ఎప్‌స్టీన్ నుంచి సలహా తీసుకున్నారని స్పష్టమవుతోంది" "ఒక వారం తర్వాత (జూలై 46, 2017), మోదీ ఇజ్రాయెల్ వెళ్లారు. తనకిచ్చిన సూచన మేరకు అక్కడ పాటలు పాడి, నృత్యం చేశారు. ఆ పని పూర్తయింది. ప్రధాన మంత్రి మోదీకి జెఫ్రీ ఎప్‌స్టీన్‌తో దీర్ఘకాలిక సంబంధం ఉందని ఇప్పుడు స్పష్టమైంది. ఇది దేశానికి సిగ్గుచేటు. ఇది జాతీయ గౌరవం, అంతర్జాతీయ ప్రతిష్ఠకు సంబంధించిన విషయం, దీనికి ప్రధాని మోదీ సమాధానం చెప్పాలి'' అని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. "జెఫ్రీ ఎప్‌స్టీన్ నుంచి ప్రధాని మోదీ ఎలాంటి సలహా తీసుకున్నారు? అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు ఏ ప్రయోజనం కలిగించేందుకు మోదీ ఇజ్రాయెల్‌లో డ్యాన్స్ చేసి పాట పాడారు? 'ఇది పనిచేసింది'...అని ఎప్‌స్టీన్ రాశారు. దాని అర్థం ఏంటి?" అనే మూడు ప్రశ్నలను కాంగ్రెస్ వేసింది. "నరేంద్ర మోదీజీ, దేశం సమాధానాలు కోరుతోంది. సీరియల్ రేపిస్ట్ ఎప్‌స్టీన్‌తో మీకు సంబంధం ఏంటి?" అని కాంగ్రెస్ ప్రశ్నించింది.

**లక్షల సంఖ్యలో కొత్త ఫైళ్లు విడుదల**

లైంగిక నేరస్తుడు జెఫ్రీ ఎప్‌స్టీన్‌కు సంబంధించిన కొత్త ఫైళ్లను లక్షల సంఖ్యలో అమెరికా న్యాయ శాఖ విడుదల చేసింది. 30లక్షల పేజీలు, లక్షాఎనభైవేల ఫోటోలు, రెండు వేల వీడియోలు బహిరంగంగా పోస్ట్ అయ్యాయి. ఎప్‌స్టీన్ సంబంధిత అన్ని పత్రాలను ప్రజల ముందుంచాలని ఆదేశించే చట్టంపై డోనల్డ్‌ట్రంప్ సంతకం చేయాల్సిన గడువు దాటిన ఆరు వారాల తర్వాత పెద్ద సంఖ్యలో ఫైళ్లు విడుదలయ్యాయి. ఈ ఫైళ్లలో జెఫ్రీ ఎప్‌స్టీన్ జైలులో గడిపిన సమయం, మానసిక స్థితిపై నివేదిక, జైలులో ఆయన మరణం గురించి వివరాలు ఉన్నాయి. ఎప్‌స్టీన్ ఉన్నత స్థాయి వ్యక్తుల మధ్య జరిగిన ఈమెయిల్స్ కూడా వీటిలో ఉన్నాయి. చాలా ఈమెయిల్స్, పత్రాలు దశాబ్ద కాలం నాటివి. చట్టపరమైన సమస్యలు ఎదుర్కొంటున్న ఎప్‌స్టీన్‌కు, ఉన్నతస్థాయి వ్యక్తులకు ఉన్న సంబంధాన్ని ఇవి వెల్లడిస్తున్నాయి. కొత్తగా విడుదలైన ఫైళ్లలో అమెరికా అధ్యక్షుడి ప్రస్తావన వందల సార్లు ఉంది.
ట్రంప్, ఎప్‌స్టీన్ మధ్య స్నేహం ఉంది. కానీ ఏళ్ల క్రితమే తమ స్నేహబంధం ముగిసిపోయిందని, ఎప్‌స్టీన్ లైంగిక నేరాల గురించి తనకేమీ తెలియదని ట్రంప్ చెబుతున్నారు. ఎప్‌స్టీన్ డాక్యుమెంట్ల విడుదల కథ ఇక్కడితో ముగుస్తుందో లేదో స్పష్టంగా తెలియదు. "ఇది చాలా విస్తృతమైన డాక్యుమెంట్ గుర్తింపు, సమీక్ష ప్రక్రియ ముగింపు. అమెరికా న్యాయశాఖ విషయానికొస్తే వారి పని ముగిసిందని తెలుపుతోంది" అని డిప్యూటీ అటార్నీ జనరల్ టాడ్ బ్లాంచ్ అన్నారు. అయితే ఎలాంటి కారణం లేకుండా ఆ శాఖ దాదాపు 25లక్షల డాక్యుమెంట్లను నిలిపివేసిందని డెమొక్రాట్లు ఆరోపిస్తున్నారు.



## వరుసగా తొమ్మిదోసారి కేంద్ర బడ్జెట్

వాటాల కొనుగోలు, అమ్మకాలపై ఈ పన్ను విధిస్తారు. ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్లలో సెక్యూరిటీస్ ట్రాన్సాక్షన్స్‌ను రెట్టింపు కంటే ఎక్కువ చేయాలనే ప్రతిపాదన ఉందని ఆర్థిక మంత్రి అన్నారు. ఫ్యూచర్ అండ్ ఆప్షన్‌లపై ప్రస్తుతం ఎస్‌టీటీ 0.02%గా ఉంది. ఇప్పుడు దానిని 0.05%కి పెంచాలని కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. ఆర్థిక మార్కెట్లలో ఆదాయాన్ని పెంచడానికి, స్థిరత్వాన్ని పెంచడానికి షేర్ల లావాదేవీలపై ఈ పన్నును విధిస్తున్నారు. ఇది పూర్తిగా విలువ ఆధారితమైనది. అంటే కొనుగోలు చేసిన లేదా అమ్మిన షేర్ల విలువ ఎక్కువగా ఉంటే కొనుగోలు చేసిన లేదా అమ్మిన వ్యక్తి లాభపడ్డాడా లేదా నష్టపోయాడా అనే దానితో సంబంధం లేకుండా ఎస్‌టీటీ కూడా అదే స్థాయిలో ఉంటుంది.
మార్కెట్‌లో స్పెక్యులేషన్‌ను తగ్గించేందుకు ఎస్‌టీటీని 2004 అక్టోబర్ 1న ప్రవేశ పెట్టారు. షేర్ల లావాదేవీల సమయంలోనే లాభనష్టాలతో సంబంధం లేకుండా ఈ పన్నును వసూలు చేస్తారు. అయితే ఎస్‌టీటీ పెంపు కేవలం ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ ట్రేడింగ్‌కే వర్తిస్తుందని ఆదాయపు పన్ను శాఖ ఎక్స్‌లో తెలిపింది. అంచనాల ఆధారంగా జరిగే ట్రేడింగ్‌ను నియంత్రించాలనే ఉద్దేశంతోనే ఈ మార్పులు అని తెలిపింది.

**ఆరెంజ్ ఎకానమీ**

"భారతదేశంలో యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్ కామిక్స్ రంగం అభివృద్ధి చెందుతోంది. దీనికి 2030 నాటికి 20 లక్షల మంది నిపుణులు అవసరం" అని ఆర్థిక మంత్రి అన్నారు. 15,000 మాధ్యమిక పాఠశాలలు, 500 కళాశాలలలో ఏవీజీసీ కంటెంట్ క్రియేటర్ ల్యాబ్‌లను ఏర్పాటు చేయడంలో ముంబైలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్రియేటివ్ టెక్నాలజీస్‌కు సహాయం చేయాలని ఆర్థిక మంత్రి ప్రతిపాదించారు. ఆరెంజ్ ఎకానమీ, లేదా క్రియేటివ్ ఎకానమీ అనేది సృజనాత్మకత, నైపుణ్యాలు, మేధో సంపత్తిపై ఆధారపడిన రంగాలను సూచిస్తుంది. వీటిలో కళ, డిజైన్, ఫ్యాషన్, సినిమా, సంగీతం, డిజిటల్ కంటెంట్ ఉన్నాయి.

**ఏప్రిల్ 1 నుంచి కొత్త ఆదాయపు పన్ను చట్టం**

కొత్త ఆదాయపు పన్ను చట్టం 2026 ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వస్తుందని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సభలో ప్రకటించారు. ఆదాయ పన్ను నియమాలను మరింత సరళీకరించి, త్వరలో ప్రవేశపెడతామని చెప్పారు. ఆదాయ పన్ను ఫారమ్‌లను సరళీకరించనున్నట్లు చెప్పారు. నామమాత్రపు రుసుముతో రివైజ్డ్ రిటర్న్‌లను మార్చి 31 వరకు దాఖలు చేయవచ్చన్నారు. ఆదాయపు పన్ను రిటర్న్ (ఐటీఆర్) దాఖలుకు సంబంధించిన కాలపరిమితి, నియమాలలో మార్పులు చేశామని ఆర్థిక మంత్రి అన్నారు. ఇక నుంచి, ఐటీఆర్1, ఐటీఆర్2 దాఖలు చేసేవారు జులై 31 వరకు రిటర్న్‌లను దాఖలు చేయవచ్చన్నారు. అయితే, ఈసారి ఆదాయపు పన్ను శ్లాబులలో ఎలాంటి మార్పులూ లేవు. వాస్తవానికి, గత సంవత్సరం ప్రవేశపెట్టిన కొత్త పన్ను విధానం ప్రకారం, రూ. 12 లక్షల వరకు వార్షిక ఆదాయంపై ఎలాంటి ఆదాయపు పన్ను లేదు. జీతభత్యాలకు స్టాండర్డ్ డిడక్షన్ రూ. 75,000, కాబట్టి మొత్తంగా రూ. 12,75,000 వరకు పన్ను ఉండదు. ఫ్యూచర్స్ ట్రేడింగ్‌పై సెక్యూరిటీస్ లావాదేవీ పన్ను (ఎస్‌టీటీ) పెంపును ఆర్థిక మంత్రి ప్రకటించారు. ఫ్యూచర్స్, ఆప్షన్స్‌పై ఎస్‌టీటీని 0.05 శాతానికి పెంచాలని ప్రతిపాదించినట్లు తెలిపారు. "భారతదేశంలో యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, కామిక్స్ (ఏవీజీసీ) రంగం అభివృద్ధి చెందుతున్న పరిశ్రమ. దీనికి 2030 నాటికి 20 లక్షల మంది నిపుణులు అవసరం" అని ఆర్థిక మంత్రి అన్నారు. 15,000 మాధ్యమిక పాఠశాలలు, 500 కళాశాలల్లో ఏవీజీసీ కంటెంట్ క్రియేటర్ ల్యాబ్‌లను ఏర్పాటు చేయడంలో ముంబయిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్రియేటివ్ టెక్నాలజీస్‌కు సాయం చేసేందుకు బడ్జెట్‌లో ప్రతిపాదనలు చేశారు.

**రేర్ ఎర్త్ మినరల్స్ కోసం ప్రత్యేక కారిడార్**

ఒడిశా, కేరళ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడులలో రేర్ ఎర్త్ మినరల్స్ కోసం ప్రత్యేక కారిడార్ ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కారిడార్‌కు 'రేర్ ఎర్త్ మాగ్నెట్ కారిడార్' అని పేరు పెట్టనున్నట్లు చెప్పారు. ఎలక్ట్రానిక్స్ భాగాల తయారీకి రూ. 40,000 కోట్లు ప్రతిపాదించారు.

**బడ్జెట్‌లో మరికొన్ని ప్రతిపాదనలు**

ఎస్ఎంఈ రంగానికి 10,000 కోట్ల వృద్ధి నిధి.. సూక్ష్మ తరహా పరిశ్రమలకు రూ. 2,000 కోట్లు.. 7 హైస్పీడ్ రైలు కారిడార్ల నిర్మాణానికి ప్రతిపాదన.. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఉదయం లోక్‌సభలో బడ్జెట్ ప్రవేశపెట్టారు. వరుసగా తొమ్మిదోసారి ఆమె కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టారు. పారిశ్రామిక వృద్ధిని పెంచడంపై ప్రభుత్వం దృష్టి సారించిందని, గత ఏడాది ఆగస్టు 15 నుంచి 350కి పైగా ఆర్థిక సంస్కరణలు అమలు చేశామని ఆర్థిక మంత్రి ప్రకటించారు. బడ్జెట్ ప్రసంగంలో ఆమె మాట్లాడుతూ, "ఆర్థిక వృద్ధిని వేగవంతం చేయడానికి, నిలబెట్టడానికి ఆరు రంగాలలో సంస్కరణలను ప్రతిపాదిస్తున్నాను ఏడు వ్యూహాత్మక రంగాలలో తయారీని పెంచడం, పాత పారిశ్రామిక ప్రాంతాలను పునరుజ్జీవింపజేయడం, చాంపియన్ ఎంఎస్ఎంఈలను సృష్టించడం, మౌలిక సదుపాయాలను ప్రోత్సహించడం, దీర్ఘకాలిక భద్రత, స్థిరత్వాన్ని నిర్ధరించడం, పట్టణ ఆర్థిక మండలాలను అభివృద్ధి చేయడం" అన్నారు. ''పదకొండేళ్లుగా ప్రధాని నాయకత్వంలో సమర్పించిన బడ్జెట్లకు దేశ ప్రజల ఆకాంక్షలే ఆధారం. ఈ బడ్జెట్లు దేశాన్ని ముందుకు తీసుకెళ్లాయి. ఇవాళ్టి బడ్జెట్ 2047నాటి అభివృద్ధి చెందిన భారత్‌ను దృష్టిలో ఉంచుకుంటుంది'' అని కేంద్ర ఆర్థిక శాఖ సహాయమంత్రి పంకజ్ చౌధురి అన్నారు. దివంగత ప్రధాని మొరార్జీ దేశాయ్ 10 బడ్జెట్‌ల రికార్డుకు ఆమె అతిచేరువలో ఉన్నారు. అయితే, మొరార్జీ దేశాయ్ పది బడ్జెట్‌లను వరుసగా ప్రవేశపెట్టలేదు. వివిధ పదవీకాలాల్లో ఆయన బడ్జెట్‌లు సమర్పించారు. నిర్మలా సీతారామన్ మాత్రం వరుసగా తొమ్మిదోసారి బడ్జెట్ ప్రవేశపెట్టారు.

## ఏయే వస్తువుల ధరలు తగ్గుతాయి ఏవి పెరుగుతాయి?

అసలు వాటి గురించి ఎలాంటి విధానపరమైన ప్రకటన చేయలేదు. 2047 నాటికి అభివృద్ధి చెందిన భారతదేశం అనే లక్ష్యం దిశగా ముందుకు సాగడంలో ఈ బడ్జెట్ చాలా ముఖ్యమైనదని కేంద్ర ఆర్థిక మంత్రి చెప్పారు. అమెరికాలోకి దిగుమతయ్యే భారత ఉత్పత్తులపై అమెరికా 50శాతం సుంకాలు విధిస్తోంది. దీంతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఆర్థికంగా అనిశ్చిత పరిస్థితులు ఉన్నాయి. బడ్జెట్ వీటన్నింటిపైనా దృష్టి సారించింది.

**అందుబాటు ధరల్లో చికిత్స, మందులు**

ఈ బడ్జెట్ ద్వారా క్యాన్సర్ వంటి తీవ్రమైన వ్యాధులతో బాధపడుతున్న రోగులు, వారి కుటుంబాలపై చికిత్స ఖర్చుల భారాన్ని తగ్గించడానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నించింది. క్యాన్సర్ చికిత్సలో ఉపయోగించే, ప్రాణాలను రక్షించే 17 ఔషధాలపై ప్రాథమిక కస్టమ్స్ సుంకాన్ని పూర్తిగా రద్దు చేశారు. ఏడు అరుదైన వ్యాధుల చికిత్సలో ఉపయోగించే దిగుమతి చేసుకున్న మందులు, ప్రత్యేక ఆహారంపై గతంలో ఉన్న పన్నులను రద్దు చేశారు.

**దేశీయ తయారీ, ఎగుమతులపై ఉపశమనం**

మైక్రోవేవ్ ఓవెన్లకు అవసరమైన కొన్ని భాగాలపై కస్టమ్స్ సుంకాలను తగ్గించారు.
సముద్ర ఆహార ఎగుమతులకు సుంకం లేని ఇన్‌పుట్ పరిమితిని 1 శాతం నుంచి 3 శాతానికి పెంచారు. తోలు, సింథటిక్ పాదరక్షలు, వస్త్రాల ఎగుమతులకు గడువు పొడిగించారు. దీని కారణంగా మార్కెట్‌లో వాటి రేటు తగ్గుతుంది. 2035 వరకు అణు విద్యుత్ ప్రాజెక్టుల కోసం దిగుమతి చేసుకునే పరికరాలపై కస్టమ్ సుంకం ఉండదు.

**ఈవీ, సౌరశక్తి, గ్రీన్ ఎనర్జీ చౌకగా మారే అవకాశం**

ప్రభుత్వం ఎలక్ట్రిక్ వాహనాలు, సోలార్ ప్యానెళ్లు, గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తిపై పన్నులను తగ్గించే ప్రయత్నం చేసింది. లిథియంఅయాన్ బ్యాటరీ నిల్వ వ్యవస్థలకు సంబంధించిన అనేక ఇన్‌పుట్‌లను కస్టమ్స్ సుంకం నుంచి మినహాయించారు. సౌర ఫలకాల తయారీలో ఉపయోగించే సౌర గాజుకు ముడి పదార్థం సోడియం యాంటిమోనేట్‌పై సుంకం తొలగించారు. దీనివల్ల విద్యుత్ వాహనాలు, సౌరశక్తి, బ్యాటరీ రంగాలలో ఉత్పత్తి ఖర్చులు తగ్గుతాయి. అయితే, ఈ ప్రయోజనాలు కస్టమర్లకు చేరుతాయా లేదా అనేది కంపెనీల విధానాల ద్వారా తేలనుంది. బడ్జెట్‌లో ప్రకటనల వల్ల ఉత్పత్తి ఖర్చులు తగ్గుతాయి. అయితే ఆ ప్రయోజనం వినియోగదారుడికి కంపెనీలు అందిస్తాయా అనేది చూడాల్సి ఉంది.

**వ్యక్తిగత దిగుమతులు, విదేశీ వ్యయాలపై ఉపశమనం**

వ్యక్తిగత వినియోగం కోసం దిగుమతి చేసుకునే వస్తువులపై కస్టమ్ సుంకాన్ని 20 శాతం నుంచి 10శాతానికి తగ్గించారు. ఇకపై విదేశాల నుంచి తెప్పించుకునే ఎలక్ట్రానిక్స్ లేదా బహుమతి వస్తువులు గతంలో కంటే చౌకగా మారతాయి. విదేశీ ప్రయాణాల కోసం టూర్ ప్యాకేజీలపై ట్యాక్స్ ఎట్ సోర్స్ వద్ద వసూలు చేసే పన్నును 2 శాతానికి తగ్గించారు. పిల్లల చదువు, చికిత్స కోసం విదేశాలకు పంపే రూ. 10 లక్షలకు మించి డబ్బుపై టీసీఎస్ 5శాతానికి బదులు 2 శాతమే విధించనున్నారు. పర్యటకం లేదా చదువుల కోసం విదేశాలకు వెళ్లే భారతీయులకు ఇది కొంత ఉపశమనం కలిగిస్తుంది.

**ఏయే వస్తువుల ధరలు పెరిగాయి?**

స్టాక్ మార్కెట్లో ట్రేడింగ్ గతంలో కంటే ఖరీదైన వ్యవహారంగా మారనుంది. ఫ్యూచర్స్ ట్రేడింగ్‌పై సెక్యూరిటీ లావాదేవీల పన్నును ప్రభుత్వం పెంచింది. ఆప్షన్స్ ప్రీమియంలపై సెక్యూరిటీస్ లావాదేవీ పన్ను పెరిగింది. దీనివల్ల ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ విభాగాలలో ట్రేడింగ్ మరింత ఖరీదైనదిగా మారనుంది.
ఇప్పుడు ప్రమోటర్లు మూలధన లాభాల పన్నుతో పాటు అదనపు పన్ను చెల్లించాల్సి ఉంటుంది. పొటాషియం హైడ్రాక్సైడ్ వంటి కొన్ని రసాయనాలు, కొన్ని వినియోగ వస్తువులపై గతంలో అందుబాటులో ఉన్న కస్టమ్ సుంకం మినహాయింపుల్ని ఎత్తివేశారు. వీటిపై ఇప్పుడు ఏడున్నర శాతం వరకు ప్రైమరీ కస్టమ్స్ డ్యూటీ అమల్లోకి రానుంది. రసాయనాల ధరలు పెరగడం వల్ల వాటితో తయారైన ఉత్పత్తుల ధరలపై ప్రభావం పడవచ్చు. మొత్తం మీద బడ్జెట్ 2026లో ఖనిజాలు, స్క్రాప్, మద్యం ఖరీదైనవిగా మారాయి.
తోలు, వస్త్రాలు, సింథటిక్ పాదరక్షలు, విదేశీ ప్రయాణం, 17 రకాల క్యాన్సర్ మందులు, మైక్రోవేవ్ ఓవెన్లు, విమాన తయారీకి సంబంధించిన వస్తువులు, ఈవీ బ్యాటరీలు, మధుమేహ మందులు మొదలైనవి చౌకగా మారుతాయని భావిస్తున్నారు. ఈసారి ప్రభుత్వం ఉత్పత్తి, వినియోగాన్ని చౌకగా చేయడంతో పాటు ఆర్థిక లావాదేవీలను ఖరీదైనదిగా చేసే మార్గాన్ని ఎంచుకుందని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రసంగ విశ్లేషణ ద్వారా స్పష్టమవుతోంది. బడ్జెట్ తర్వాత ఖరీదైనవిగా మారే ఉత్పత్తులు, కార్యకలాపాలలో స్టాక్ మార్కెట్ ఫ్యూచర్స్‌ఆప్షన్స్ ట్రేడింగ్ ఉన్నాయి. బడ్జెట్ తర్వాత వైద్య ఖర్చులు తగ్గే అవకాశం ఉంది. విదేశీ ప్రయాణం, విద్యపై పన్నులు తగ్గుతాయి. రోజువారీ జీవితంలో ఉపయోగించే అనేక ఎలక్ట్రానిక్, ఇంధన సంబంధిత ఉత్పత్తులు చౌకగా మారవచ్చు.

# యాదగిరీశుడికి నిత్యపూజల వైభవం

- నృసింహ వైభవంపై చాగంటి ప్రవచనం

**జయభేరి, యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 01 :**

శ్రీ లక్ష్మినరసింహ స్వామి వారికి నేత్రపర్వంగా నిత్య పూజలు కొనసాగుతున్నాయి. తెల్లవారుజామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతం, అర్చనను శాస్త్రోక్తంగా నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనాలకు అనుమతించారు. శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారిని దర్శించుకున్న భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో జరిగిన శ్రీసుదర్శన నారసింహ హోమం, నిత్యకల్యాణం, నిత్య బ్రహ్మోత్సవం, వెండి జోడి సేవ, స్వర్ణ పుష్పార్చన, శ్రీసత్య నారాయణస్వామి వ్రత పూజలలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం కొండపైన కొలువైన శ్రీపర్వతవర్ధినీ సమేత రామలింగే శ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాతగుట్ట శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారిని దర్శించుకొని ఆలయంలో జరిగిన నిత్యపూజలలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.





### శ్రీనారసింహుడి నిత్యరాబడి..

శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారికి నిత్యరాబడిలో భాగంగా శనివారం రూ.23,73,364 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ప్రధాన బుకింగ్ ద్వారా రూ.1,50,450, బ్రేక్ దర్శనం ద్వారా రూ.1,54,200, వీఐపీ దర్శనం ద్వారా రూ.2,10,000, కొండపైకి వాహన ప్రవేశం ద్వారా రూ.2,42,500, సువర్ణ పుష్పార్చన ద్వారా రూ.52,000, ప్రసాద విక్రయం ద్వారా రూ.9,53,260, కల్యాణకట్ట ద్వారా రూ.44,000తో పాటు వివిధ శాఖలు, పాతగుట్ట ఆలయం ద్వారా ఆలయం వచ్చినట్లు అధికారులు తెలిపారు.

### నృసింహ వైభవంపై చాగంటి ప్రవచనం..

శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు ప్రవచనం నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆయనకు వేదాశీర్వచనం చేయగా, అధికారులు స్వామివారి జ్ఞాపిక, లడ్డు ప్రసాదాన్ని అందజేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో నృసింహ వైభవంపై చాగంటి కోటేశ్వరరావు ప్రవచనం చేశారు. భారీగా తరలివచ్చిన భక్తులు చాగంటి ప్రవచనాన్ని విని ఆనందించారు. ఆయన వెంట యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత్ రావు, యాదగిరిగుట్ట ఆలయ ఈవో భవానీ శంకర్, ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నర్సింహ్మమూర్తి, అధికారులు, సిబ్బంది ఉన్నారు.

# టచ్ చేస్తే.. అగ్నిగుండమే..

- యాదగిరిగుట్ట ఆలయంలో అక్రమాలపై సిట్ ఎందుకు వేయరు?
- యాదగిరిగుట్ట పట్టణంలోని నల్ల జెండాలతో బీఆర్ఎస్ ర్యాలీ నిరసన
- మాజీ డిసిసిబీ గొంగిడి మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో నిరసన,హెచ్చరిక

**జయభేరి, యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 01 :**



కేసీఆర్ ప్రజల దేవుడు, ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించిన మహనీయుడు,రైతులు తమ గుండెల్లో పెట్టుకున్న అభివృద్ధి ప్రదాత..ఫోన్ ట్యాపింగ్ పేరిట ఆయనను అప్రతిష్టపాలు చేయాలనుకోవడం భ్రమ.. కెసిఆర్ ను టచ్ చేస్తే తెలంగాణ రాష్ట్రం అగ్నిగుండం అవుతుందని బీఆర్ఎస్ రాష్ట్ర నేత, మాజీ డిసిసిబి చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి తీవ్రంగా ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సుప్రీంకోర్టు ఆదేశాలకు విరుద్ధంగా కేసీఆర్ ను విచారణ పేరిట వేధించడం విషాదకరమన్నారు.

### అక్రమాలపై సిట్ ఎందుకు వేయరు?

యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి ఆలయంలో జరుగుతున్న అక్రమాలపై సజ్జనార్ లేదా శివధర్ రెడ్డితో సెట్ ఎందుకు వేయరు అని గొంగిడి మహేందర్ రెడ్డి ప్రశ్నించారు. ఆలయంలో బంగారు వెండి డాలర్లు మాయమైతే సిట్ వేయరు.. సింగరేణి దోపిడిపై సిట్ వేయరు. ఆత్మహత్యలు దోపిడీలపై సిట్ ఎందుకు వేయరు అని ఆయన ప్రభుత్వానికి నిలదీశారు.

### ఈవోల మార్పిడి మతలబు ఏంటీ?

యాదగిరిగుట్ట దేవస్థానం ఈవోలను పూటకో మారుగా మారుస్తున్నారు..
కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఐదు మంది ఈవోలను ఎందుకు మార్చారు. అధికారులపై ఒత్తిడి తీసుకు వస్తున్నారా.. అంటూ గొంగిడి మహేందర్ రెడ్డి ప్రశ్నించారు. నల్ల జెండాలు చేబూని నిర్వహించిన నిరసన ర్యాలీలో బిఆర్ఎస్ నేతలు కర్రె వెంకటయ్య, గంగసాని నవీన్, కవిడే మహేందర్ తోటకూరి అనురాధ బీరయ్య, మిట్ట వెంకటయ్య, పల్లేపాటి బాలయ్య, కోల వెంకటేష్,పాపట్ల నరహరి, ఆవుల సాయి, నరసింహ, దండబోయిన అనిల్, రాచకొండ శ్రీనివాస్, మానుపాటి పరశురాం, సతీష్ బట్ , చిత్తర్ల బాలయ్య, కసావు శ్రీనివాస్, సయ్యద్ బాబా తదితరులు పాల్గొన్నారు.

# ఆలయం ప్రచార శాఖలో డాలర్ల మాయంపై సస్పెన్షన్లు.. మెమోలు

**జయభేరి, యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 01 :**

శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం ప్రచార శాఖలో భక్తులకు విక్రయించే బంగారు, వెండి డాలర్ల గల్లంతుపై విచారణ కమిటీ ఏర్పాటు చేయడంతో పాటు.. బాధ్యులపై శాఖ పరమైన చర్యలకు దేవస్థానం ఉపక్రమించింది. ప్రచార శాఖలో మాయమైన బంగారం,వెండి డాలర్ల ఘటనపై ఆలయ ఈఓ భవాని శంకర్ విచారణ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ ఇచ్చిన వివరాలను పరిశీలన చేసిన యాదగిరిగుట్ట ఆలయ ఈఓ భవాని శంకర్ సంబంధిత అధికారులపై చర్యలు చేపట్టారు. గత మూడు రోజులుగా ఈ కమిటీ నివేదిక అనంతరం శాఖాపర మైన చర్యలకు ఆలయ ఈఓ భవాని శంకర్ క్రమశిక్షణ చర్యలు చేపట్టే విధంగా ఉత్తర్వులు జారీ చేసారు. ప్రచార శాఖలో విధులు పట్ల నిర్లక్ష్యం వహించినందుకు జూనియర్ అసిస్టెంట్ రామ చంద్రశేఖర్,రికార్డ్ అసిస్టెంట్ లక్ష్మిలను విధుల నుండి సస్పెండ్ చేశారు. ఇద్దరు పర్యవేక్షకులకు చార్జ్ మెమోలు జారీ చేశారు. అదే విధంగా సంబంధిత సహాయ కార్యనిర్వాహణాధికారి రఘుకు షోకాజ్ నోటీస్ జారీ చేశామని యాదగిరిగుట్ట ఆలయ ఈఓ భవాని శంకర్ తెలిపారు.

# అంబటి రాంబాబుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి వియ్యపు డిమాండ్

- టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు. వియ్యపు చిన్న డిమాండ్



**జయభేరి, పరవాడ:**

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పై వైసీపీ మాజీ మంత్రి అంబటి రాంబాబు చేసిన అనుచిత, అవమానకర వ్యాఖ్యలను పరవాడ మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వియ్యపు చిన్నా తీవ్రంగా ఖండించారు.అంబటి రాంబాబు తీరుపై నిప్పులు చెరిగారు. ఈ సందర్భంగా వియ్యపు చిన్నా మాట్లాడుతూ ఒక మాజీ మంత్రిగా, ప్రజాప్రతినిధిగా పనిచేసిన వ్యక్తి, రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న ముఖ్యమంత్రిపై కనీస అవగాహన లేకుండా బాధ్యతారాహిత్యంగా మాట్లాడటం ప్రజాస్వామ్యానికే సిగ్గుచేటని అన్నారు. ఇలాంటి వ్యాఖ్యలు రాష్ట్ర ప్రజల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

# కాంగ్రెస్ పాలనలోనే అభివృద్ధి, సంక్షేమం

- దోశలు వేస్తూ... ఇస్త్రీ చేస్తూ.. హెయిర్ కటింగ్ చేస్తూ.. కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ..
- ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య వినూత్న ప్రచారం

**జయభేరి, యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 01 :**



ప్రజల ఆశీర్వాదంతో ఆలేరు ఎమ్మెల్యే నైనా.. ప్రజలలో ఒకడిగా.. ప్రజా సేవకుడుగా మీతోనే ఉంటా.. మీ ఓటు ఈ బీసీ బిడ్డకు కొండంత అండ.. కాంగ్రెస్, సీపీఐ కౌన్సిలర్ అభ్యర్థులకు ఓటు వేసి యాదగిరిగుట్ట, ఆలేరు మున్సిపాలిటీలలో కాంగ్రెస్ జెండా ఎగురవేసి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కానుక ఇద్దాం... మన ప్రాంతాలను అభివృద్ధి చేసుకుందాం ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య గడప గడప ప్రచారం చేపట్టారు. గడప గడపన అభివృద్ధి చేస్తానని యాదగిరిగుట్ట పట్టణ ప్రజలకు హామీ ఇచ్చారు. యాదగిరిగుట్ట పట్టణంలోని 1వ, 2వ, 3వ, నాలుగో వార్డు పాటు 11వ వార్డుల్లో ఆయన వినూత్నంగా మున్సిపల్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. దోసెలు వేస్తూ... ఇస్త్రీ చేస్తూ.. కటింగ్ చేస్తూ ఓటర్లను ఆకర్షించారు..
కాంగ్రెస్ పాలనలోనే అభివృద్ధి, సంక్షేమం
ఈ సందర్భంగా బీర్ల ఐలయ్య మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో జరిగిన వైఫల్యాలను ఎండగట్టుతూ, బిఆర్ఎస్, బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించారు. అలాగే ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలనలో భాగంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ,అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు తెలియజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తోందని,పట్టణ అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని పేర్కొన్నారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరుతూ ఓట్లను అభ్యర్థించారు. ఈ ప్రచార కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ వార్డు అభ్యర్థులు బూడిద మధు,బరిగే రమ్య రామచందర్,కాటబత్తిని స్వప్నఆంజనేయులు, గౌళికౌర్ అరుణ రాజేష్, ముఖ్యర్ల మల్లేష్ యాదవ్, కాంగ్రెస్ నేతలు చీర శ్రీశైలం, కానుగు బాలరాజు,గుండ్లపల్లి భరత్ గౌడ్,దుంబాల వెంకట్ రెడ్డి,బందారపు బిక్షపతి,నువ్వుల రమేష్,ఎరుకలహేమేందర్, గుండు నరసింహ గౌడ్, సుదగాని గోపాల్,పులగం శోభారాణి,చక్రపాణి, సరాఫ్ బాల్ కిషన్,వేముల వెంకటేష్ తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు,స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




# ట్రాఫిక్ మహోత్సవంకి ట్రాఫిక్ పై అవగాహన కార్యక్రమం

**జయభేరి, పరవాడ:**

ట్రాఫిక్ మహోత్సవం సందర్భంగా బీకే స్టీల్స్ పరవాడ పోలీస్ శాఖ వారి ఆధ్వర్యంలో వినూత్నమైన ట్రాఫిక్ అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో యూనిట్ హెడ్ టీవీ వర్మ, హెచ్ఆర్ ఎస్. రాము అన్ని విభాగాల హెచ్ఓడీలు మరియు ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ అవగాహన కార్యక్రమానికి పరవాడ పోలీస్ స్టేషన్ సిబ్బంది కూడా భాగస్వాములై, ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా హెల్మెట్ ఉపయోగం, తప్పనిసరిగా హెల్మెట్ ధరించాల్సిన అవసరం, హెల్మెట్ లేకుండా వాహనం నడపడం వల్ల జరిగే ప్రాణనష్టం వంటి అంశాలను ప్రజలకు స్పష్టంగా వివరించారు.ప్రజల దృష్టిని ఆకర్షించే విధంగా యమధర్మరాజు తదితర వేషధారణలతో రోడ్డు మీదుగా చిన్న ఊరేగింపు నిర్వహించి, రోడ్డు ప్రమాదాల భయానకతను, ట్రాఫిక్ నియమాలు పాటించకపోతే కలిగే పరిణామాలను ప్రత్యక్షంగా ప్రజలకు తెలియజేశారు. ఈ సందర్భంగా హెల్మెట్ ధరించడం ద్వారా ప్రాణాలను ఎలా కాపాడుకోవచ్చో సులభంగా అర్థమయ్యే విధంగా వివరించారు. పరవాడ పోలీసులు తమ వంతుగా రోడ్డు భద్రత, ట్రాఫిక్ క్రమశిక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించడం నిరంతరం చేస్తున్నామని, పరిశ్రమలు మరియు సంస్థలు కూడా ఇలాంటి కార్యక్రమాల్లో ముందుకు రావడం అభినందనీయమని తెలిపారు. బీకే స్టీల్స్ యాజమాన్యం మరియు ఉద్యోగులు కూడా ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ, సమాజానికి ఆదర్శంగా నిలవాల్సిన బాధ్యత ఉందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఇలాంటి అవగాహన కార్యక్రమాల ద్వారా రోడ్డు ప్రమాదాలు తగ్గి, ప్రజల ప్రాణాలు రక్షించబడతాయని పరవాడ పోలీసులు తెలిపారు.

# కోడి పందాల రాయుళ్ళు పై పోలీసులు దాడులు



**జయభేరి, పరవాడ:**

పరవాడ పోలీస్ స్టేషన్ పరిధిలోని పచ్చకొరవాణిపాలెం గ్రామంలో కోడి పందాలు నిర్వహిస్తున్నట్లు పోలీస్లకు అందిన సమాచారం మేరకు హెచ్చిలోవరాజు ఆధ్వర్యంలో పరవాడ పోలీస్ స్టేషన్ సిబ్బందితో కలిసి దాడి నిర్వహించారు.ఈ దాడిలో పరవాడ పోలీస్లు 5 మంది వ్యక్తులు 6 కోళ్లు (పుంజులు), నగదు రూ. 1,930 ను స్వాధీనం చేసుకుని, నిందితులపై సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోబోదునట్టు పోలీస్ శాఖ తెలియజేసింది.

# మండల స్థాయి వాలీబాల్ పోటీలు ప్రారంభించిన సర్పంచ్ కనకారావు

- సర్పంచ్ సొంత నిధులతో 30 మంది క్రీడాకారులకు టీ షర్ట్లు,ట్రాక్ లు అందుచేత



**జయభేరి, పరవాడ:**

పరవాడ మండలం కలపాక పంచాయతీలో గురువారం జరగనున్న శ్రీ దుర్గమాంబ అమ్మవారి జాతర మహోత్సవం సందర్భంగా కలపాక యూత్ ఆధ్వర్యంలో మండల స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నారు.ఈ మేరకు ఆదివారం స్థానిక సర్పంచ్ బొండా కనకారావు ముఖ్య అతిథిగా విచ్చేసి పోటీలను ప్రారంభించారు.ఈ సందర్భంగా తన తల్లిదండ్రులు స్వర్గీయ బొండా మూలయ్య ఆదియమ్మ దంపతుల జ్ఞాపకార్థం తన సొంత నిధులతో పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు 30 మందికి టీ షర్ట్లు,ట్రాక్ లు సర్పంచ్ కనకారావు అందజేశారు.ఈ సందర్భంగా పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులకు ఆయన శుభాకాంక్షలు తెలుపుతూ ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఇందల అశోక్, బొండా భీమరాజు,నగిరెడ్డి అజయ్,పెంటారావు, నర్సింగరావు గ్రామ పెద్దలు, యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# మైసమ్మ అమ్మవారి 5వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహణ

**జయభేరి, మేడిపల్లి :**

గ్రేటర్ హైదరాబాద్ బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని అశోక్ నగర్ కాలనీలో కొలువైన మైసమ్మ అమ్మవారి 5వ వార్షికోత్సవ వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరికీ ఆరోగ్యం, శాంతి, సుభిక్షం కలగాలని ప్రార్థించారు. ఈ వేడుకల్లో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, మహిళలు, యువకులు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



## వైకాపా గ్రామ కమిటీలు పై మండల సన్నాహక సమావేశం

- సమావేశంలో పాల్గొన్న మండల, జిల్లా పార్టీ నాయుకులు

**జయభేరి, పరవాడ:**

పరవాడ మండల వైయస్సార్ కాంగ్రెస్ కార్యాలయంలో మండల పార్టీ అధ్యక్షులు కోనరామారావు అధ్యక్షతన జరిగిన పార్టీ గ్రామ కమిటీలు మరియు అనుబంధ విభాగాల నిర్మాణం కొరకు ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశానికి ముఖ్య అతిథులుగా హజరైన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి మాడుగుల& పాయకరావుపేట నియోజకవర్గాల పరిశీలకులు పైల శ్రీనువాసరావు,మండల జడ్పీటీసీ జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు పీస్ రాజు హజరై కమిటీల నిర్మాణం కొరకు సూచనలు సలహాలు ఇచ్చారు. ప్రతి గ్రామ పంచాయతీ లో గ్రామ కమిటీ మరియు ఏడు గ్రామ అనుబంధ కమిటీలు ప్రతి గ్రామంలో వేయాలని చెప్పారు. ఈ యొక్క సమావేశం లో మండల వైస్ ఎంపీపీ భూస అప్పలరాజు, గ్రామ ఇన్చార్జి అప్పికొండ మహాలక్ష్మినాయుడు, సర్పంచ్ గొర్లి అమ్మలు గోపి, మాజీ ఎంపీటీసీ కావలి రాజు, మండల కమిటీ ఉపాధ్యక్షులు బొబ్బిలి సత్తిబాబు, జనరల్ సెక్రటరీలు నందవరపు శ్రీను, గొర్లి శ్రీను వాస్, సెక్రటరీలు గండి సూరిబాబు, నారపిన్ని శ్రీను, కరెడ్ల సూరిబాబు, పైల హరీష్,కావలి వాసు, పల్లా గోవింద్, మండల ఎస్సి సెల్ ఈదలపాక సన్యాసిరావు, మండల సోషల్ మీడియా పాసిల దివ్య, వెన్నల సింహాద్రి, పైడం నాయుడు, మాసవరపు అప్పారావు,వర్రి హరి,మునిగొండ సంజీవు, కొత్తపల్లి వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ మండల పార్టీ ఆధ్వర్యంలో రాస్తారోకో



**జయభేరి, తుర్కపల్లి, ఫిబ్రవరి 01 :**

తుర్కపల్లి మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో బీఆర్ఎస్ మండల పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు పిన్నపురెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్నటువంటి కక్షపూరిత రాజకీయా నిర్ణయాలకు నిరసనగా మండలంలోని అన్ని గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలను చేపట్టినట్టు తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కు నీట్ విచారణ నోటీసులు ఇవ్వడం దురదృష్టకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు బోయిని సత్తయ్య, సర్పంచులు సీతరాజు, సుధాకర్ నాయక్, బద్దు నాయక్ మాజీ ఎంపీటీసీలు పలుగుల నవీన్ కుమార్, తలారి శ్రీనివాస్, భాస్కర్ నాయక్, మాజీ సర్పంచులు గుంటి శ్రీశైలం, సురేష్, ఇమ్మడి మల్లప్ప, నాంసాని సత్యనారాయణ, పిఎసిఎస్ మాజీ డైరెక్టర్ చెక్కల మల్లేశం, ఉపసర్పంచ్ బాల్ నర్సయ్య నాయకులు, కార్యకర్తలు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## పలుగుల మైసమ్మ తల్లి దేవాలయం క్యాలెండర్ ఆవిష్కరణ



**జయభేరి, తుర్కపల్లి, ఫిబ్రవరి 01 :**

తుర్కపల్లి మండలం వాసాలమర్రి గ్రామ పరిధిలోని పలుగుల మైసమ్మ తల్లి దేవాలయం వద్ద దేవాలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పలుగుల నవీన్ కుమార్, ఉప సర్పంచ్ జేరిపోతుల బాలనర్సయ్య వార్డు సభ్యులు పలువుల అవినాష్, దేవాలయ చైర్మన్ పలుకుల మహేందర్, వైస్ చైర్మన్ పలుగుల రజిని కుమార్, వెంకటేశ్వర్లు, రవీందర్, ప్రకాష్, శ్రీకాంత్, గోనె శ్రీనివాస్, సంజీవ, కలకొండ వెంకటాచారి, శ్రీపతి మల్లేష్, కొండ బాబు, బెజ్జనమైన నరసింహులు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## వీరారెడ్డిపల్లి లో ఉచిత వైద్య శిబిరం




**జయభేరి, తుర్కపల్లి, ఫిబ్రవరి 01 :**

తుర్కపల్లి మండలం వీరారెడ్డిపల్లి గ్రామంలో శ్రీనిధి ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఘట్కేసర్ కు చెందిన జాతీయ సేవా పథకం వాలంటీర్ల ఆధ్వర్యంలో గ్రామ వికాస్ ప్రత్యేకత ఏడు రోజుల శిక్షణ లో భాగంగా మూడవరోజు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ప్రీతి జీవన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో కంటి, దంత, సాధారణ ఆరోగ్య, హృదయ పరీక్షలు నిర్వహించి వైద్య సేవలను అందించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ తునికి లక్ష్మీ రామిరెడ్డి పరిశీలించి అభినందించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్, గ్రామస్తులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీకే పట్టం కట్టాలి

- కొలను సంతోష్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు
- అవినీతి పార్టీలను తరిమికొట్టాలి
- పరకాల అభివృద్ధి బీజేపీతోనే సాధ్యం

**జయభేరి, పరకాల, ఫిబ్రవరి 01:**



అవినీతి పార్టీలైన బీఆర్ఎస్, కాంగ్రెస్‌లను తరిమికొట్టి పరకాల అభివృద్ధికి బీజేపీకి అవకాశం ఇవ్వాలని బీజేపీ హన్మకొండ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్ రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. ఆదివారం పరకాల పట్టణంలోని బీజేపీ పార్టీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు గాజుల నిరంజన్ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సమావేశంలో పరకాల బీజేపీ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే డాక్టర్ పగడాల కాళీ ప్రసాద్ రావు, మున్సిపల్ ఎన్నికల కన్వీనర్ డాక్టర్ సిరంగి సంతోష్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొలను సంతోష్ రెడ్డి మాట్లాడుతూ.. గత ఎమ్మెల్యే వ్యాపార ధోరణితో వ్యవహరిస్తూ భూ దందాలకు పాల్పడ్డారని, పరకాల అభివృద్ధిని పూర్తిగా విస్మరించారని ఆరోపించారు. అలాగే ప్రస్తుత ఎమ్మెల్యేకు పరకాలతో ఎలాంటి సంబంధం లేనట్లుగా వ్యవహరిస్తూ అభివృద్ధిపై నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శించారు. పరకాల అభివృద్ధి జరగాలంటే మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ చైర్మన్ గెలుపే ఏకైక మార్గం అని స్పష్టం చేశారు. ప్రతి కార్యకర్త 100 మంది సైనికుల్లా పని చేసి బీజేపీ చైర్మన్‌ను గెలిపించడం మనందరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈటల రాజేందర్, బండి సంజయ్‌తో పాటు కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారం బీజేపీకి ఉందని తెలిపారు. అవినీతి పార్టీలకు చెక్ పెట్టి బీజేపీకి పట్టం కట్టాలని ప్రజలను కోరారు.

బీజేపీ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే డాక్టర్ కాళీ ప్రసాద్ రావు మాట్లాడుతూ.. గత మున్సిపల్ ఎన్నికల్లో అధికార దాహంతో బీఆర్ఎస్ ఎమ్మెల్యే బీజేపీ అభ్యర్థులను నిలబడనివ్వలేదని ఆరోపించారు. ప్రస్తుతం 22 వార్డుల్లో 22 మంది అభ్యర్థులను నిలబెట్టడమే బీజేపీ విజయమని అన్నారు. పార్టీలో అంతర్గత విభేదాలు లేవని, పార్టీ కోసం కష్టపడ్డ వారికే టికెట్లు ఇచ్చామని తెలిపారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు డబ్బులతో ఓటర్లను కొంటామని ప్రగల్భాలు పలుకుతున్నారని విమర్శిస్తూ, ప్రజాస్వామ్య దేశంలో ఓటర్లు అమ్ముడుపోరని స్పష్టం చేశారు. డబ్బుల బలంతో గెలవాలనుకునే పార్టీలకు ఈ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని ప్రజలను కోరారు. మున్సిపల్ ఎన్నికల కన్వీనర్ డాక్టర్ సిరంగి సంతోష్ కుమార్ మాట్లాడుతూ.. పరకాలను జిల్లా చేయాలనే సంకల్పం బీజేపీకి మాత్రమే ఉందని అన్నారు. పరకాల అనేక సమస్యల ఊబిలో కూరుకుపోయిందని, వాటన్నింటినీ పరిష్కరించాలంటే బీజేపీ పాలన తప్పనిసరి అని పేర్కొన్నారు. చుట్టుపక్కల నియోజకవర్గాల్లో ప్రభుత్వ ఆసుపత్రులు, మెడికల్ కాలేజీలు, మౌలిక సదుపాయాలు అభివృద్ధి చెందుతున్నా పరకాలలో మాత్రం నిర్లక్ష్యం కొనసాగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పరకాల అభివృద్ధి లక్ష్యంగా బీజేపీ పనిచేస్తుందని, మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించి బీజేపీ చైర్మన్‌కు అవకాశం ఇవ్వాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో జయంత్ లాల్, మేగనాథ్, సంద్ర మధు, ఎర్ర రామన్న కూతురు రాజు, పరకాల ప్రధాన కార్యదర్శి సంగా పురుషోత్తం, నాయకులు మార్త రాజభద్రయ్య, కొలనుపాక భద్రయ్య, బెజ్జగి పూర్ణాచారి, సిరంగి సతీష్, బాసాని సోమరాజు, కుక్కల విజయ్, నారాయణదాసు, మేకల రాజ వీరు, భాస్కరాచారి, పాలకుర్తి తిరుపతి, దంచనాల కిరణ్, ముత్యాల దేవేందర్, ఆకుల శ్రీధర్, గిరి, మెంతుల సురేష్ పిట్ట కిషోర్, పైండ్ల రంజిత్, సాదా మధుకర్, కృపాకర్ రెడ్డి, దుబాసి కృష్ణ ప్రసాద్, ఉడుత చిరంజీవి, సదా రాణి, వెలిశెట్టి శారద, పుల్ల రాజు, తదితరులు పాల్గొన్నారు.




## మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం ఖాయం

- రామన్నగారి రాఘవేందర్ గౌడ్

**జయభేరి, మేడ్చల్ :**

కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలుపిస్తాయని మేడ్చల్ డివిజన్ సీనియర్ నాయకుడు రామన్నగారి రాఘవేందర్ గౌడ్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎల్లంపేట్ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాలను కైవసం చేసుకుని చైర్మన్ పీఠాన్ని హస్తగతం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. నిత్యం ప్రజలలో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేసే నాయకులు కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థులుగా టికెట్లు కేటాయించి బరిలో ఉన్నారని, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అందిస్తున్న ప్రజాపాలనకు ప్రజల నుండి మంచి ఆదరణ ఉందన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో ఓటర్లు అధికార పార్టీ వైపు ఉన్నారని, ఎల్లంపేట్ మున్సిపాలిటీ లోని 24 స్థానాలను కాంగ్రెస్ పార్టీ గెలుపు సాధిస్తుందన్నారు. 10 సంవత్సరాల బిఆర్ఎస్ పాలనలో చేసిన అభివృద్ధి ఏమి లేదని కెసిఆర్ రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో ముంచిందని రాఘవేందర్ గౌడ్ విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన రెండు సంవత్సరాలలో లక్ష ఉద్యోగాలు, ఇందిరమ్మ ఇల్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500 లకు గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల విద్యుత్, రేషన్ కార్డుల పంపిణీ వంటి సంక్షేమ పథకాలు అమలు చేస్తుందన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు తమ ప్రాంత అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు మద్దతుగా ఓటు వేసి అధికార పార్టీకి పట్టం కట్టాలని కోరారు.

## టిఆర్పి పార్టీలోకి భారీ చేరికలు



**జయభేరి, తుర్కపల్లి, ఫిబ్రవరి 01 :**

తుర్కపల్లి మండలం బిలియా నాయక్ తండ గ్రామపంచాయతీ నుండి నలుగురు వార్డు సభ్యులు, సుమారు 50 మంది నాయకులు చిన్న నాయకత్వంలో వివిధ పార్టీలకు రాజీనామా చేసి ఆదివారం టిఆర్పి పార్టీ అధినేత తీన్మార్ మల్లన్న సమక్షంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో ఆలేరు నియోజకవర్గ ఇన్చార్జ్ కొమ్మిరి శెట్టి నరసింహులు, మాజీ జిల్లా జెడ్పి వైస్ చైర్మన్ ధనావత్, బిక్కు నాయక్, జిల్లా నాయకులు పాంగల కిష్టయ్య, మోత్కుపల్లి రఘు, తదితరులు పాల్గొన్నారు.

## దేశవ్యాప్త సమ్మె జయప్రదం చేయండి

- సమ్మె జయప్రదం కై ఫార్మసిటిలో ర్యాలీ

**జయభేరి, పరవాడ:**




ఫిబ్రవరి 12న దేశవ్యాప్త సమ్మెలో కార్మికుల, ఉద్యోగులు, రైతులు భాగస్వాములు కావాలని సిఐటియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గని శెట్టి సత్యనారాయణ పిలుపునిచ్చారు. పరవాడ ఫార్మసిటీలో ఆదివారం సిఐటియు ఆధ్వర్యంలో సమ్మె జయప్రదం కై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గని శెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ ఎన్డీఏ హయంలోని బిజెపి ప్రభుత్వం కార్మిక చట్టాలు మార్చవద్దని కేంద్ర కార్మిక సంఘాలు ఎంత హితవు పలికిన పేడదోవన పెట్టారన్నారు. బీహార్ ఎన్నికల తర్వాత మరింత వేగం పెంచిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మిక వర్గంలో ఎంత వ్యతిరేకత వచ్చినప్పటికీ, తమ విధానాలు అమలు చేయడం బిజెపి లక్ష్యంగా పెట్టుకుందని అర్థమవుతుందన్నారు. బిజెపి విధానాలను తిప్పికొట్టేందుకు కార్మికులకు పెద్ద ఎత్తున కదిలి రావాలని గని శెట్టి పిలుపునిచ్చారు. ఫిబ్రవరి 12న పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొన్నాలన్నారు. సంఘటిత, అసంఘీత కార్మికులు వీధుల్లోకి వచ్చి పోరాటం చేయడం ద్వారా బిజెపి ప్రభుత్వ తలొగ్గాలా ఉండాలన్నారు. లేదంటే బిజెపికి షాక్ తగలదని ఎద్దేవా చేశారు. రాష్ట్ర కూటమి ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వానికి వత్తాసు పలుకుతూ రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తుందన్నారు. పోరాడి సాధించిన 8 గంటలను 10 గంటలు చేయడాన్ని గని శెట్టి తీవ్రంగా ఖండించారు. ఫిబ్రవరి 12 సమ్మెకు రాష్ట్రంలో ప్రధాన సంఘటిత రంగాలైన రవాణ రంగాలైన రైల్వే, బస్సు, ఆటో లను నిలుపుదల చేయలన్నారు. బ్యాంకు, ఇన్సూరెన్స్, అన్ని రంగాల కార్మికులు ముందుండి పోరాడాలని పిలుపునిచ్చారు . రైతాంగం ఢిల్లీ వీధుల్లో కేంద్ర రాజధానిలో ఏడాది పాటు ఏవిధంగా పోరాటం చేశారో, ఆవిధంగా చేస్తేతప్పా బిజెపి కేంద్ర ప్రభుత్వం దిగిరాదన్నారు. లేబర్ కోడ్స్ రద్దు చేసే వరకు పోరాడుతామని అన్నారు. ఈ ర్యాలీలో సిఐటియు నాయకులు పి చిన్నారావు, ఏ రాజా, వెంకట్రావు, కృష్ణ, సత్తిబాబు, ధారబాబు, పాల్గొన్నారు.

## వైభవంగా హనుమత్ వాహన సేవ

- ఘనంగా ప్రభోత్సవం
- హనుమత్ వాహనంపై ఊరేగిన వెంకటేశ్వర స్వామి వారు
- నేడు అశ్వవాహన సేవ ద్వితీయ ప్రభోత్సవం

**జయభేరి, దేవరకద్ర :**





మహబూబ్ నగర్ జిల్లా మన్యంకొండ శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం రాత్రి హనుమత్ వాహన సేవ పూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాలలో ప్రతిరోజు ఒక సేవ చొప్పున దేవస్థానంలో నిర్వహిస్తారు. అందులో భాగంగానే ఉత్సవాల 4వ రోజు స్వామివారి హనుమత్ వాహన సేవ కార్యక్రమాన్ని సాంప్రదాయ రీతిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థానం రథ మండపంలో స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం హనుమత్ వాహనంపై దేవస్థానం పురవీధుల గుండా స్వామి వారిని ఊరేగించారు. రకరకాల ఆభరణాలు, పూల అలంకరణలో స్వామివారు హనుమత్ వాహనంపై ఊరేగుతూ భక్తకోటికి దర్శనం ఇచ్చారు. వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చిన భక్తులు స్వామివారి సేవను చూసి తరించారు.

**-ఘనంగా ప్రభోత్సవం**


మన్యం కొండ దేవస్థానంలో స్వామివారి బ్రహ్మోత్సవాలు సందర్భంగా శనివారం అర్ధరాత్రి స్వామి వారి ప్రభోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. స్వామివారి రథోత్సవానికి ఒకరోజు ముందు ఈ పూజా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. అందులో భాగంగానే స్వామివారిని దేవస్థానం గర్భగుడి నుండి హనుమత్ వాహనంపై తేరు మైదానానికి ఊరేగింపుగా తీసుకువచ్చారు. పురోహితుల వేదమంత్రాలు, సన్నాయి వాయిద్యాలు, కాగడాల వెలుతురు, భక్తుల హరినామశ్చరణల మధ్య ఈ ఊరేగింపు ముందుకు కదిలింది. అనంతరం అక్కడ భక్తుల మధ్య స్వామి వారి ప్రభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం స్వామివారిని మళ్లీ హనుమత్ వాహనంపై గర్భగుడిలోకి తీసుకెళ్లి ప్రత్యేక పూజా కార్యక్రమాలను యధావిధిగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని తిలకించడానికి భక్తులు అధిక సంఖ్యలో మన్యంకొండకు తరలివచ్చారు.ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్, వంశపారంపర్య ధర్మకర్త అళహరి మధుసూదన్ కుమార్, ఈఓ శ్రీనివాసరాజు, ప్రధాన పూజారులు రాజేష్, నరసింహయ్య, పర్యవేక్షకుడు నిత్యానంద చారి, దేవస్థానం పురోహితులు, సిబ్బంది, వివిధ ప్రాంతాలనుండి తరలి వచ్చిన భక్తులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



**-నేడు అశ్వవాహన సేవ**

మన్యం కొండ శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో సోమవారం రాత్రి స్వామివారి అశ్వ వాహన సేవ, ద్వితీయ ప్రభోత్సవ కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా నుండి కాక ఇతర రాష్ట్రాల నుండి వేలాదిగా భక్తులు మన్యంకొండకు తరలివస్తారు. దీంతో భక్తుల సౌకర్యార్థం దేవస్థానం వద్ద అని ఏర్పాట్లు చేశారు.ఈ సందర్భంగా స్వామివారిని అలంకరణలో అశ్వ వాహనంపై ఊరేగిస్తారు. అనంతరం స్వామివారి ద్వితీయ ప్రభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.

# రాజకీయ కక్షతోనే బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ పై తప్పుడు కేసులు



జయభేరి, దేవరకొండ :

రాజకీయ కక్షతోనే బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ పై తప్పుడు కేసులు బనాయించి,రేవంత్ రెడ్డి ప్రభుత్వ పాలనా వైఫల్యానికి నిదర్శనమని బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు,దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు. ఆదివారం తెలంగాణ జాతి పిత, కోట్లాదిమంది ప్రజల ఆరాధ్యుడు కేసీఆర్ పై రాజకీయ కక్షతో రేవంత్ రెడ్డి ప్రభుత్వం సాగిస్తున్న కుతంత్రాలకు నిరసనగా దేవరకొండ పట్టణంలోని బస్ స్టాండ్ వద్ద రాస్తారోకో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫోన్ ట్యాపింగ్ కేసు పేరుతో ప్రతిపక్షాన్ని భయపెట్టే ప్రయత్నాలు చేయడం ప్రజాస్వామ్య విలువలకు అవమానం అని అభిప్రాయపడ్డారు.కేసీఆర్ పై సిట్ అధికారుల దర్యాప్తు ప్రభుత్వ దివాలకోరుతనానికి నిదర్శనం అని ఆయన అన్నారు.కేసీఆర్ ను ఎదుర్కోలేక కాంగ్రెస్ బీజేపీ తోడు దొంగల్లా ఒక్కటై పనికి మాలిన చెత్త ఆరోపణలు చేస్తున్నారు.

కెసిఆర్ పై లేని కేసును సృష్టించి ఈ ప్రభుత్వం తమ పబ్బం గడుపు కుంటున్నారు అని ఆయన తెలిపారు. రేవంత్ రెడ్డి బావమరిది సుజన్ రెడ్డి బొగ్గు గనుల కేటాయింపు కుంభకోణాన్ని బయటపెట్టినందుకే, ప్రజల సమస్యల నుంచి దృష్టి మళ్లించేందుకు ఈ డైవర్షన్ పాలిటిక్స్ అని అన్నారు.ప్రజల తరఫున గట్టిగా మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ని, మాజీ మంత్రి హరీష్ రావు ని, మాజీ రాజ్యసభ సభ్యులు సంతోష్ ని ఎదుర్కోలేక, ఇప్పుడు మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ పై అక్రమ కేసులతో దాడి చేయడం ఈ ప్రభుత్వ భయానికి నిదర్శనం అని, చట్టం, న్యాయవ్యవస్థలపై మాకు పూర్తి గౌరవం ఉందన్నారు. మంత్రులు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటూ నీతిమాలిన పనులకు పాల్పడుతున్నారు.ఇది స్కీముల ప్రభుత్వం కాదు, స్కాముల ప్రభత్వం.ప్రజలు ఎప్పుడో గమనించారు అని,మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు గట్టి బుద్ధి చెబుతారు అని ఆయన అన్నారు.

కేసీఆర్ పై సిట్ అధికారులు అత్యుత్సాహం చూపిస్తున్నారు అని ఆయన అన్నారు.మున్సిపల్ ఎన్నికల సందర్భంగా మా నాయకులపై లేని కేసులు పెట్టి డైవర్ట్ చేయడానికి ప్రయత్నిస్తుంది ఈ ప్రభుత్వం అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఎన్నికల ఇంచార్జీ పాల్వాయి స్రవంతి, రాష్ట్ర నాయకులు నేనావత్ కిషన్ నాయక్, కేతావత్ బిల్యా నాయక్, బిఆర్ఎస్ మండల అధ్యక్షులు TVN రెడ్డి, చింతపల్లి సుభాష్ గౌడ్,గాజుల ఆంజనేయులు, నీల రవికుమార్,జర్పుల లోక్య నాయక్, లోహిత్ రెడ్డి,బోయపల్లి శ్రీనివాస్ గౌడ్,వేముల రాజు, బిఆర్ఎస్వీ దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ఆఫీస్ బేరల్స్ ట్రైనింగ్ ప్రోగ్రాం

జయభేరి, దేవరకొండ :

వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో వి 104 ఏ ఆఫీస్ బేరల్స్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ నల్గొండ జిల్లా కేంద్రంలో వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ఆఫీస్ బేరల్స్ ట్రైనింగ్ సెమినార్కు ముఖ్యఅతిథిగా వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ అడ్మినిస్ట్రేటివ్ వైస్ ప్రెసిడెంట్ రేణిగుంట్ల శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం దేవరకొండలో 3 kv సోలార్ విద్యుత్ ప్యానెల్స్ ను ఉచితంగా ఏర్పాటుచేసిన శివ సాయి మార్కెటింగ్ సోలార్ ఎనర్జీస్ మేనేజింగ్ డైరెక్టర్ బుద్ధ శ్రీనివాస్ గుప్తను ఘనంగా సన్మానించారు వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినందుకు దేవరకొండ వాసవి క్లబ్ డిస్ట్రిక్ట్ వైస్ ట్రెజరర్ నీల సంజీవ్ కుమార్ ను అభినందించారు. ఈ కార్యక్రమంలో బుద్ధ శ్రవణ్ కుమార్ గవర్నర్ వీరెల్లి సతీష్ కుమార్ క్యాబినెట్ సెక్రటరీ నూనె కిషోర్ pro ఉప్పల విద్యాసాగర్ కోటగిరి రామకృష్ణ మాది గవర్నర్ కమలాకర్ వైస్ గవర్నర్ రాయపూడి భవాని REC గందే మహేష్ దేవరకొండ వాసవి క్లబ్ అధ్యక్షులు అతుకూరి అంజనేయులు వాసవి వనిత క్లబ్ గ్రేటర్ దేవరకొండ అధ్యక్షురాలు పందిరి జ్యోతి కార్యదర్శి బెజవాడ మల్లేశ్వరి కోశాధికారి ఆలంపల్లి శిరీష వాసవి క్లబ్ డిస్ట్రిక్ట్ ఆలంపల్లి పద్మ రీజన్ చైర్మన్ కొత్త సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

## కెసిఆర్ పై సిట్ నోటీసులు జారీ చేయడంపై తీవ్రంగా మండిపడ్డ ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి



జయభేరి, షాద్ నగర్, ఫిబ్రవరి 01 :

తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి బీఆర్ఎస్ పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావుపై సిట్ నోటీసులు జారీ చేయడాన్ని ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి తెలంగాణ భవన్ లో బీఆర్ఎస్ నాయకులతో కలిసి మాట్లాడుతూ.. చావు నోట్లో తలబెట్టి కేసీఆర్ సచ్చుడో తెలంగాణ వచ్చుడో అనే అచంచల సంకల్పంతో సుదీర్ఘ ఉద్యమం చేసి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన మహానాయకుడు కేసీఆర్ అని అన్నారు. ఎన్నో పోరాటాలు చేసి సాధించిన తెలంగాణను పదేళ్ల పాలనలో దేశానికే కాదు ప్రపంచానికి చాటి చెప్పిన దూరదృష్టి గల నాయకుడు కేసీఆర్ అని అన్నారు. అన్ని వర్గాల సంక్షేమాన్ని కడుపులో పెట్టుకుని, రాష్ట్రాన్ని చంటి బిడ్డలా చూసుకుంటూ సాగునీటి విప్లవం, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, రైతుబంధు, రైతు బీమా, దళితబంధు వంటి పథకాల ద్వారా తెలంగాణను అభివృద్ధి పథంలో నడిపించిన గొప్ప విజనరీ కేసీఆర్ పై ఇప్పుడు విచారణల పేరుతో నోటీసులు ఇవ్వడం దురుద్దేశపూరిత రాజకీయాలకు నిదర్శనమని విమర్శించారు.అడ్డగోలు హామీలు ఇచ్చి, అబద్ధాల పునాదుల మీద అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది గడవకముందే ప్రజల నోట్లో మట్టి కొట్టిందని, ఇచ్చిన హామీల అమలులో పూర్తిగా విఫలమైందని ఆయన ఆరోపించారు. తమ పాలనా వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే ఇప్పుడు కేసీఆర్ గారిపై కక్షసాధింపు రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు.

ఇది విచారణ కాదు!... ప్రతీకారం.!! ఇది న్యాయం కాదు!... రాజకీయ దురుద్దేశం!" అని స్పష్టం చేశారు. కేసీఆర్ తెలంగాణ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన నాయకుడని, నోటీసులతో గానీ బెదిరింపులతో గానీ తెలంగాణ చరిత్రను చెరిపేయలేరని అన్నారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని అవమానించే ప్రతి ప్రయత్నానికీ ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని నవీన్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు.



## భవనం శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే బాలు నాయక్

జయభేరి, దేవరకొండ :

దేవరకొండ నియోజకవర్గ శాసనసభ్యులు నేనావత్ బాలు నాయక్ కట్టకొమ్ము తండ గ్రామ పంచాయతీలో SHG/VO భవనానికి శంకుస్థాపన చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా సర్పంచ్ నేనావత్ జ్యోతి పాండు, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు, ప్రజాప్రతినిధులు మరియు స్థానిక ప్రజలు విస్తృతంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, మహిళా సాధికారతకు SHG/VO భవనాలు ఎంతో ఉపయోగపడతాయని, గ్రామ అభివృద్ధికి ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని తెలిపారు అలాగే ప్రజా ప్రభుత్వంలో ప్రజల అభిరుద్ది కి ప్రభుత్వం కృషి చేస్తుంది తెలియచేశారు సర్పంచ్ జ్యోతి పాండు నాయక్ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ కి గ్రామ అభివృద్ధికి అందిస్తున్న సహకారానికి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమం విజయవంతం చేసిన ప్రతి ఒకరికి పేరు పేరునా సర్పంచ్ ధన్యవాదములు తెలియజేసినారు.

## ఎక్సేంజ్ కానిస్టేబుల్ సౌమ్యకు జనసేన పార్టీ సానుభూతి కన్నీటి నివాళి



జయభేరి, దేవరకొండ :

నిజామాబాద్ ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్య గంజాయి స్మగ్లర్లు పట్టుకునే సమయంలో తీవ్రంగా గాయపడిన సౌమ్య ను హుటాహుటిగా సిబ్బందులు నిజామాబాద్ ప్రైవేట్ హాస్పిటల్లో చేర్పించారు అక్కడ నుంచి నిమ్స్ హాస్పిటల్లో మెరుగైన వైద్యం కోసం తీసుకురాగా నిన్న రాత్రి నిమ్స్ హాస్పిటల్లో మృతి చెందడం జరిగింది ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్యకు జనసేన పార్టీ సేవాలాల్ బంజారా సంఘం తరఫునుంచి ప్రగడ సానుభూతి తెలియజేస్తూ ఆత్మ శాంతి చేకూరాలని ఆ దేవుడిని ప్రార్థిస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి మరియు పోలీస్ అధికారులకి డిమాండ్ చేస్తూ గంజాయి స్మగ్లర్ ఎవరైతే ఉన్నారో ఎంత పెద్ద స్థాయిలో ఉన్నా కూడా వారిని పోలీసు వారు కస్టడీలో తీసుకొని నడిరోడ్డుపై తీసుకొచ్చి షూట్ చేయాలని అలా చేయని ఈ ప్రభుత్వం జనసేన పార్టీ తరఫు నుంచి వందల మందితో అసెంబ్లీ ముట్టడిస్తామని హెచ్చరించారు ఎక్సేంజ్ కానిస్టేబుల్ సౌమ్య కుటుంబ ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఐదు కోట్లు మూడెకరాల భూమి ఇచ్చి ఆదుకోవాలని తెలంగాణ రాష్ట్ర రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి డిమాండ్ చేశారు.

## రాజకీయ కక్షతోనే కెసిఆర్ పై తప్పుడు కేసులు నమోదు



జయభేరి, చింతపల్లి, ఫిబ్రవరి 01:

రాజకీయ కక్షతోనే బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ తప్పుడు కేసులు బనాయించి, రేవంత్ రెడ్డి ప్రభుత్వ పాలనా వైఫల్యానికి నిదర్శనమని బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు దోంతం శేఖర్ రెడ్డి అన్నారు. ఆదివారం మాజీ సీఎం కేసీఆర్ రాజకీయ కక్షతో రేవంత్ రెడ్డి ప్రభుత్వం సాగిస్తున్న కుతంత్రాలకు నిరసనగా చింతపల్లి మండల కేంద్రంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫోన్ ట్యాపింగ్ కేసు పేరుతో ప్రతిపక్షాన్ని భయపెట్టే ప్రయత్నాలు చేయడం ప్రజాస్వామ్య విలువలకు అవమానం అని అభిప్రాయపడ్డారు.కేసీఆర్ పై సిట్ అధికారుల దర్యాప్తు ప్రభుత్వ దివాలకోరుతనానికి నిదర్శనం అని ఆయన అన్నారు.కేసీఆర్ ను ఎదుర్కోలేక కాంగ్రెస్ బీజేపీ తోడు దొంగల్లా ఒక్కటై పనికి మాలిన చెత్త ఆరోపణలు చేస్తున్నారు.కెసిఆర్ పై లేని కేసును సృష్టించి ఈ ప్రభుత్వం తమ పబ్బం గడుపు కుంటున్నారు అని ఆయన తెలిపారు. రేవంత్ రెడ్డి బావమరిది సుజన్ రెడ్డి బొగ్గు గనుల కేటాయింపు కుంభకోణాన్ని బయటపెట్టినందుకే, ప్రజల సమస్యల నుంచి దృష్టి మళ్లించేందుకు ఈ డైవర్షన్ పాలిటిక్స్ అని అన్నారు. ప్రజల తరఫున గట్టిగా మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీష్ రావు, మాజీ రాజ్యసభ సభ్యులు సంతోష్ ను ఎదుర్కోలేక, ఇప్పుడు మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ అక్రమ కేసులతో దాడి చేయడం ఈ ప్రభుత్వ భయానికి నిదర్శనం అని, చట్టం, న్యాయవ్యవస్థలపై మాకు పూర్తి గౌరవం ఉందన్నారు. మంత్రులు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటూ నీతిమాలిన పనులకు పాల్పడుతున్నారు. ఇది స్కీముల ప్రభుత్వం కాదు, స్కాముల ప్రభత్వం ప్రజలు ఎప్పుడో గమనించారు అని, మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు గట్టి బుద్ధి చెబుతారు అని ఆయన అన్నారు. కేసీఆర్ పై సిట్ అధికారులు అత్యుత్సాహం చూపిస్తున్నారు అని ఆయన అన్నారు. మున్సిపల్ ఎన్నికల సందర్భంగా మా నాయకులపై లేని కేసులు పెట్టి డైవర్ట్ చేయడానికి ప్రయత్నిస్తుంది ఈ ప్రభుత్వం అని ఆయన అన్నారు.

ఈ కార్యక్రమంలో సర్పంచ్ మాచర్ల శ్రీశైలం, రమావత్ కోండల్, మాజీ సర్పంచ్ లు వింజమూరు రవి, సుమతీ రెడ్డి, నాయకులు గండేటి వెంకటయ్య, వాంకుడోతు దాసు, ఆరెకంటి రాధాకృష్ణ, ముదిగొండ మొగిలి, బిచ్చ నాయక్, శంకర్, మైసయ్య, ఆంజనేయులు, కళ్యాణ్, అజహార్, సల్మాన్ పాల్గొన్నారు.

## ఆవు దూడను చంపిన పెద్దపులి



జయభేరి, తుర్కపల్లి, ఫిబ్రవరి 01 :

తుర్కపల్లి మండలం గంధ మల్ల గ్రామ పరిధిలోని చెక్కల గూడెంలో చెక్కల నర్సింహులు బావి వద్ద పెద్దపులి ఆదివారం ఉదయం ఆవు దూడను చంపి వేసింది. ఇట్టి విషయాన్ని గ్రహించిన రైతు ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించడంతో ఫారెస్ట్ అధికారులు వచ్చి పరిశీలిస్తున్నారు. రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు.

## అంబేడ్కరా రేవంత్ సర్కార్ కు బుద్ధి చెప్పండి

- చల్లా ధర్మారెడ్డి
- పరకాల అంబేడ్కర్ విగ్రహానికి లేఖ అందచేసిన చల్లా




జయభేరి, పరకాల, ఫిబ్రవరి 01 :

భారత రాజ్యాంగం, చట్టాలపై కనీస అవగాహన లేకుండా కక్షపూరిత పాలన సాగిస్తున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి రాజ్యాంగ స్ఫూర్తి ఏంటో అర్థమయ్యేలా బుద్ధి చెప్పాలని కోరుతూ, పరకాల పట్టణంలోని డా. బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహానికి పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి వినతి పత్రాన్ని అందచేశారు. ఈ సందర్భంగా చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పై రాజకీయ కక్షతో సిట్ నోటీసులు జారీ చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ దుర్మార్గ పాలనకు నిదర్శనమని తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ప్రజల సమస్యలు పట్టని సీఎం రేవంత్ రెడ్డి తన అసమర్థతను కప్పిపుచ్చుకోవడానికి ప్రతిపక్ష నేతలపై అక్రమ కేసులు, నోటీసులతో రాజకీయ వేధింపులకు పాల్పడుతున్నారని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన నాయకుడిని టార్గెట్ చేయడం అంటే తెలంగాణ ప్రజల ఆకాంక్షలపైనే దాడి చేసినట్లేనని ఆయన స్పష్టం చేశారు. డా. అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం సమానత్వం, న్యాయం, స్వేచ్ఛకు ప్రతీక కాగా, ఆ రాజ్యాంగాన్ని నేడు రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికార దుర్వినియోగంతో అపహాస్యం చేస్తోందని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో పూర్తిగా విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం, పాలనపై చర్చకు దూరంగా ఉండి ప్రతిపక్షాన్ని అణిచివేయడమే లక్ష్యంగా పెట్టుకుందని దుయ్యబట్టారు. ఈ కక్ష రాజకీయాలను తెలంగాణ ప్రజలు సహించరని, అవసరమైతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉద్ధృతం చేస్తామని చల్లా ధర్మారెడ్డి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పాలనపై ప్రజలు విరక్తితో ఉన్నారు

- చల్లా ధర్మారెడ్డి
- ప్రవాహంలా బిఆర్ఎస్‌లో చేరికలు



జయభేరి, పరకాల, ఫిబ్రవరి 01:

పరకాల మున్సిపాలిటీ పరిధిలోని 1వ వార్డు, 18వ వార్డులకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆ పార్టీ విధానాలు, పాలనపై పూర్తిగా విరక్తి చెంది కాంగ్రెస్‌కు రాజీనామా చేసి బిఆర్ఎస్ లో చేరారు. ఈ చేరికలు పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సమక్షంలో జరిగాయి. ఈ సందర్భంగా చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అసమర్థ పాలనకు, నాయకత్వ వైఫల్యాలకు విసిగి ప్రజలు ఒక్కొక్కరుగా ఆ పార్టీని వీడుతున్నారని, పరకాల మున్సిపాలిటీలో కాంగ్రెస్‌కు రోజురోజుకు ఆదరణ కోల్పోతోందని స్పష్టం చేశారు. బిఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలే నేటికీ ప్రజలకు గుర్తున్నాయని, అందుకే గులాబీ జెండా వైపు ప్రజలు ఆకర్షితులవుతున్నారని అన్నారు.

ఈ చేరికలతో పరకాల మున్సిపాలిటీలో బిఆర్ఎస్ మరింత బలపడిందని, రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదని చల్లా ధర్మారెడ్డి హెచ్చరించారు. ప్రజల పక్షాన నిలబడే బిఆర్ఎస్ పార్టీలో చేరిన ప్రతి కార్యకర్తకు పూర్తి స్థాయిలో అండగా ఉంటామని హామీ ఇచ్చారు. పార్టీలో చేరిన వారిలో ఒకటవ వార్డు నుండి దుబాసి రవీందర్, దుబాసి మధు, దుబాసి మధు (చిట్టి మధు), స్వరూప, ఒంటేరు జంపయ్య, సాగర్, రాజకుమార్, బొచ్చు వినయ్, పైండ్ల రవి, శంకర్, పున్నం సంపత్, నాగరాజు, వైనాల సురేష్, 18వ వార్డు నుండి యూత్ నాయకులు ఎం సృజన్ కుమార్, ఏ శివ తేజ, రవి చందర్, రాజు, సాయి,భాను,చంటి, విక్కి లతో పాటు పలువురు చేరారు. ఈ కార్యక్రమంలో అబ్బర్వర్,రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ కేతిపెల్లి వాసుదేవ రెడ్డి, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీ ఛైర్మెన్ పీఠం కాంగ్రెస్ దే

జయభేరి, మేడ్చల్ :


మూడుచింతలపల్లి మున్సిపల్ పీఠం కాంగ్రెస్ పార్టీ హస్తగతం చేసుకుంటుందని మేడ్చల్ డీసీసీ అధ్యక్షుడు, మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. ఆదివారం ఎన్నికల ప్రచారంలో భాగంగా మేడ్చల్ నియోజకవర్గం, మూడు చింతలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని కొల్తూరులో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు మద్దతుగా కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ -మల్కాజ్గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్, బోడుప్పల్ మాజీ మేయర్, మూడు చింతలపాలెం మున్సిపాలిటీ ఎన్నికల ఇన్చార్జ్ తోటకూర అజయ్ యాదవ్ పాల్గొని ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపల్ ఎన్నికల్లో మూడు చింతలపల్లి మున్సిపాలిటీ ఛైర్మెన్ పదవి ఖచ్చితంగా కాంగ్రెస్ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ప్రజలకు అందిస్తున్న అభివృద్ధి కార్యక్రమాలే పార్టీ విజయానికి నిదర్శనమని పేర్కొన్నారు. స్థానిక సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులే సరైన ఎంపికని అన్నారు.



# 'మెగా 158'పై ఆసక్తికర చర్చలు..
## నిర్మాణ భాగస్వామ్యంలో మార్పులు ?

మెగాస్టార్ చిరంజీవి ప్రస్తుతం సినీ ప్రయాణంలోనూ, కుటుంబ జీవితంలోనూ ఉత్సాహభరిత ఫేజ్‌లో ఉన్నారు. ఈ మధ్య విడుదలైన మన శంకర వరప్రసాద్ గారు చిత్రం చిరుకి సూపర్ హిట్ అందించింది. ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద మంచి స్పందన సాధించడంతో ఫ్యామిలీతో పాటు ఫ్యాన్స్ కూడా ఫుల్ ఖుష్ అయ్యారు. ఇక ఇప్పుడు బాబీ దర్శకత్వంలో చిత్రం చేస్తున్నారు మెగాస్టార్. 'మెగా 158' గా పిలవబడుతున్న ఈ చిత్రంపై ఇండస్ట్రీలో పెద్ద ఎత్తున చర్చ సాగుతోంది. భారీ బడ్జెట్‌తో పాన్ ఇండియా స్థాయిలో రూపొందనున్న ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్స్ నిర్మించనుంది. అయితే తాజాగా ఫిల్మ్ నగర్ వర్గాల్లో వినిపిస్తున్న సమాచారం ప్రకారం, ఈ ప్రాజెక్ట్ నిర్మాణ భాగస్వామ్యంలో కొన్ని మార్పులు చోటుచేసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం ఆ నిర్మాణ సంస్థ ఇతర పెద్ద సినిమాల పనులతో బిజీగా ఉండటంతో పాటు ఆర్థిక ప్రణాళికలను పునర్వ్యవస్థీకరించుకుంటున్నట్లు తెలుస్తోంది. భారీ స్థాయి ప్రాజెక్ట్ కావడంతో బడ్జెట్, షెడ్యూల్, మార్కెటింగ్ వంటి అంశాలపై మరింత స్పష్టత కోసం మేకర్స్ సమయం తీసుకుంటున్నారనే టాక్ వినిపిస్తోంది. దీంతో 'మెగా 158' ప్రారంభం కొంత ఆలస్యమయ్యే అవకాశాలపై చర్చ మొదలైంది. అయితే ఇది పూర్తిస్థాయి వాయిదా కాదని, నిర్మాణ భాగస్వామ్యాన్ని విస్తరించే దిశగా చర్చలు జరుగుతున్నాయనే అభిప్రాయాలు కూడా ఉన్నాయి. అవసరమైతే మరో నిర్మాణ సంస్థను కోప్రొడ్యూసర్‌గా తీసుకునే అవకాశాన్ని కూడా పరిశీలిస్తున్నారన్న వార్తలు వినిపిస్తున్నాయి. ఈ మార్పులు సినిమాకు మరింత బలం చేకూర్చేలా ఉండొచ్చని కొందరు విశ్లేషకులు భావిస్తున్నారు. చిరంజీవి-బాబీ కాంబినేషన్‌పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్న నేపథ్యంలో కథా రూపకల్పన, సాంకేతిక బృందం ఎంపిక, విజువల్ స్కేల్ వంటి అంశాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టుతున్నట్లు సమాచారం. యాక్షన్, ఎమోషన్, మాస్ ఎలిమెంట్స్ సమ్మిళితంగా ఉండేలా స్క్రిప్ట్ సిద్ధమవుతోందని, మెగాస్టార్ ఇమేజ్‌కు తగ్గట్టుగా కొత్త కోణాన్ని చూపించే ప్రయత్నం జరుగుతోందని టాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. మొత్తానికి 'మెగా 158' చుట్టూ జరుగుతున్న ఈ చర్చలు సినిమాపై ఆసక్తిని మరింత పెంచుతున్నాయి. నిర్మాణ భాగస్వామ్యంలో మార్పులు వచ్చినా, ప్రాజెక్ట్ మాత్రం భారీ స్థాయిలోనే రూపొందుతుందనే నమ్మకం అభిమానుల్లో వ్యక్తమవుతోంది. అధికారిక ప్రకటన వెలువడిన తర్వాతే పూర్తి స్పష్టత వచ్చే అవకాశం ఉన్నప్పటికీ, ఈ ప్రాజెక్ట్ టాలీవుడ్‌లో అత్యంత ఆసక్తికర చిత్రాల్లో ఒకటిగా మారడం ఖాయం అనిపిస్తోంది.

# జార్జియాకు పయనం



ఇటీవలే 'వారణాసి' సినిమా విడుదల తేదీని ప్రకటించిన విషయం తెలిసిందే. మహేష్‌బాబు కథానాయకుడిగా రాజమౌళి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ గ్లోబల్ యాక్షన్ ఎంటర్‌టైనర్ వచ్చే ఏడాది ఏప్రిల్ 7న ప్రేక్షకుల ముందుకురానుంది. ఇప్పటికే దాదాపు 30 శాతం చిత్రీకరణ పూర్తయినట్లు సమాచారం. భారీ స్థాయిలో యాక్షన్ సీక్వెన్స్, గ్రాఫిక్ హంగులకు ప్రాధాన్యం ఉండటంతో ఈ సినిమాను అనుకున్న ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలనే సంకల్పంతో ఉన్నారట దర్శకుడు రాజమౌళి. 'వారణాసి' ప్రస్తుతం హైదరాబాద్‌లో చిత్రీకరణ జరుపుకుంటున్నది. తాజా సమాచారం ప్రకారం కీలక షెడ్యూల్ కోసం చిత్రబృందం త్వరలో జార్జియాకు పయనం కానున్నట్లు తెలిసింది. ప్రధాన తారాగణం పాల్గొనగా అక్కడ కొన్ని ముఖ్య ఘట్టాలను తెరకెక్కిస్తారట. భారతీయ పురాణాలతో ముడిపడిన సాహసగాథగా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ఐమాక్స్ ఫార్మాట్‌తో చిత్రీకరిస్తున్న ఈ సినిమాను పలు భారతీయ భాషల్లో విడుదల చేయబోతున్నారు. ప్రియాంకచోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ తదితరుల ప్రధాన పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కీరవాణి సంగీతాన్నందిస్తున్నారు.



# అందంలో తగదేలే అంటున్న కాజల్..

టాలీవుడ్ హీరోయిన్ కాజల్ అగర్వాల్ గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. దక్షిణాదిలో టాప్ హీరోయిన్లలలో ఒకరిగా మారిన కాజల్.. కెరీర్ ఫాంలో ఉన్నప్పుడే తన స్నేహితుడు గౌతమ్ కిచ్లూని పెళ్లి చేసుకుని సినిమాలకు దూరంగా ఉంది. ఈ దంపతులకు నీల్ కిచ్లూ అనే బాబు ఉన్నారు. పెళ్లి తర్వాత సినిమాలకు దూరంగా ఉంటున్న కాజల్.. సోషల్ మీడియాలో మాత్రం అందాల గత్తరలేపుతుంది. చాలా కాలం తర్వాత గ్లామర్ లుక్స్ లో ఫోటోస్ షేర్ చేసింది. నాలుగు పదుల వయసులోనూ ఏమాత్రం తగ్గని అందంతో కట్టిపడేస్తుంది కాజల్. తాజాగా ఆమె షేర్ చేసిన ఫోటోస్ ఆకట్టుకుంటున్నాయి. లక్ష్మీ కళ్యాణం సినిమాతో తెలుగు తెరకు పరిచయమైన కాజల్.. తొలి చిత్రంతోనే నటిగా ప్రశంసలు అందుకుంది. ఆ తర్వాత చందమామ మూవీతో బ్లాక్ బస్టర్ హిట్ అందుకుంది. తెలుగులో ప్రభాస్, ఎన్టీఆర్, రామ్ చరణ్, నాగ చైతన్య వంటి స్టార్ హీరోలతో ఎన్నో హిట్స్ చేసింది ఈ అమ్మడు. తెలుగుతోపాటు తమిళంలోనూ వరుస హిట్స్ అందుకున్న ఈ అమ్మడు.. ఇప్పుడు సరైన ఆఫర్ కోసం ఎదురుచూస్తుంది. ప్రస్తుతం కాజల్ వయసు 40 సంవత్సరాలు. ఇప్పటికీ ఏమాత్రం తగ్గని అందంతో కట్టిపడేస్తుంది ఈ వయ్యారి. కాజల్ ఒక్క సినిమాకు రూ. 2 కోట్లు తీసుకుంటుందని సమాచారం. నివేదికల ప్రకారం కాజల్ ఆస్తులు దాదాపు రూ. 80 కోట్ల వరకు ఉన్నట్లు సమాచారం. అలాగే ఆమె సినిమాలతోపాటు యాడ్స్, బ్రాండ్ ప్రమోషన్స్ ద్వారా భారీగానే సంపాదిస్తుందని టాక్. ఇప్పుడు ఆమె సంవత్సరానికి రూ. 6 కోట్లు తీసుకుంటుందని అంచనా.



# బాలీవుడ్ మీద సీరియస్ గా ఫోకస్ చేస్తున్న మౌనీ

మౌనీ రాయ్ పేరు బుల్లితెర ప్రేక్షకులకు సుపరిచితం కాగా, ఇటీవల బ్రహ్మాస్త్ర సినిమాలో జూనూన్ పాత్రతో సినిమా ప్రేక్షకులనూ ఆకట్టుకున్నారు. ఈ చిత్రం ద్వారా తెలుగు ప్రేక్షకులకు కూడా దగ్గరైన ఆమె, ఒకప్పుడు హరహర మహాదేవ్లో సతీదేవిగా పేరుపొందారు. ప్రస్తుతం, మౌనీ వెండితెరపై తన స్థానాన్ని సుస్థిరం చేసుకోవడానికి కృషి చేస్తున్నారు. దీనిలో భాగంగా ఆమె పాత్రికేయ రోల్స్ నుంచి ఐటెం సాంగ్స్ వరకు ఎలాంటి అవకాశాన్నీ వదులుకోవడం లేదు. కేజీఎఫ్, వేదా చిత్రాలలో ఆమె చేసిన స్పెషల్ సాంగ్స్‌కు మంచి స్పందన లభించింది. టాలీవుడ్‌లో విశ్వంభర సినిమాతో ప్రవేశించనున్న మౌనీ, బాలీవుడ్‌లోనూ రెండు సినిమాల్లో నటిస్తున్నారు.

# సరికొత్త కథతో రానున్న నవీన్ చంద్ర..
# హనీ ట్రైలర్ అదిరిపోయిందిగా..!!



నవీన్ చంద్ర, దివ్య పిళ్లై ప్రధాన పాత్రల్లో కరుణ కుమార్ రచన, దర్శకత్వం వహించిన సైకలాజికల్ హారర్ మూవీ హనీ. OVA ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై రవి పీట్ల, ప్రవీణ్ కుమార్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రాన్ని శేఖర్ స్టూడియోస్ సమర్పిస్తోంది. సైకలాజికల్ డెప్త్, సోషల్ రిలవెన్స్, హారర్ అంశాలతో రూపొందిన 'హనీ' ఫిబ్రవరి 6న థియేటర్ లో రిలీజ్ అవుతుంది. ఇప్పటికే విడుదలైన ప్రమోషనల్ కంటెంట్ అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. తాజాగా మేకర్స్ ట్రైలర్ ని లాంచ్ చేశారు. ట్రైలర్ లాంచ్ ఈవెంట్ లో హీరో నవీన్ చంద్ర మాట్లాడుతూ.. ట్రైలర్ కి చాలా అద్భుతమైన రెస్పాన్స్ రావడం చాలా ఆనందంగా ఉంది. ఈ సినిమా ఫిలిం మేకింగ్ ప్రాసెస్ నేను చాలా ఎంజాయ్ చేశాను. ఇది మౌత్ టాక్ తో నిలబడే సినిమా. మాకు ఉన్న బడ్జెట్లో థియేటర్స్ కి తీసుకొచ్చి ఆడియన్స్ కి ఒక డిఫరెంట్ ఎక్స్పీరియన్స్ ఇవ్వాలని నేను ఎప్పుడు ప్రయత్నం చేస్తూనే ఉన్నాను. ఫిబ్రవరి 6న దయచేసి ఒకసారి థియేటర్ కి రండి. ఇది థియేటర్ కి చాలా బాగుంటుంది. దివి చాలా అద్భుతమైన నటి. తను తప్పకుండా పెద్ద స్టార్ అవుతుంది. దివ్య కూడా చాలా చక్కగా నటించింది. ఈ సినిమా వెంటాడుతూనే ఉంటుంది. ఇది ఆలోచన రేకెత్తించే సినిమా. డిఓపి మ్యూజిక్ డైరెక్టర్ అద్భుతమైన వర్క్ ఇచ్చారు. ఇందులో ఉన్న పాప కూడా చాలా చక్కగా నటించింది. మట్కా సినిమా సమయంలో కరుణ కుమార్ గారితో చాలా దగ్గర అయ్యను. ఈ కథకు ఆయన నన్ను ఎంచుకోవడం చాలా ఆనందంగా ఉంది. ఆయన నాపై పెట్టుకున్న నమ్మకాన్ని నేను నిలబెట్టుకున్నానని అనుకుంటున్నాను అని అన్నారు. అలాగే ఈ సమాజంలో ఆశ కోసం ప్రజలు ఏవేవో చేస్తున్నారు. ఇందులో ఒక డార్క్ సొసైటీని చూపించాము. ఈ కథ విన్న తర్వాత నేను చాలా జాగ్రత్తగా ఉన్నాను. మానసికంగా బలహీనంగా ఉన్నప్పుడే ఇలాంటి వాటికి మనం విక్టిమ్ అవుతాం. ఆనంద్ క్యారెక్టర్ ని క్రియేట్ చేసిన కరుణ కుమార్ గారికి థాంక్యూ సో మచ్. మీరు ఈ సినిమాని ఆదరిస్తే ఇలాంటి కథలు మరిన్ని వస్తాయి. ఈ సినిమా చేస్తున్నప్పుడు చాలా మ్యాడ్ నెస్ లో ఉన్నాను. చాలా ఇంటెన్సిటీ ఉన్న క్యారెక్టర్ ఇది. ఈ సినిమా షూటింగ్లో ఒక సంఘటన జరిగింది. ఈ క్యారెక్టర్ ప్రభావం వల్ల ఒక వ్యక్తితో నేను దురుసుగా ప్రవర్తించాను. అయితే అది నేను కాదు. ఆ క్యారెక్టర్ అలా ప్రవర్తించింది. తప్పకుండా ఫిబ్రవరి 6న ఈ సినిమాని అందరూ థియేటర్స్ లో చూడాలని కోరుకుంటున్నాను అని చెప్పుకొచ్చారు నవీన్ చంద్ర.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at Hamara Warangal Printers and Graphics, # 25-8-182, Babuji Nagar, Kazipet, Warangal, Telangana - 506003.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889. PRGI No: TGTEL/25/A0314.** email: **jayabherinews@gmail.com, www.jayabheridaily.com**